navajyothidaily.com

# నవజ్యోతి

ప్రచురణ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | గురువారం 03 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : మన్నే లక్ష్మణ్ | సంపుటి : 1 సంచిక : 402 | పేజీలు : 10 | వేల : 5/-

## జల భద్రతే.. దేశ భద్రత!

- కేంద్రం-రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలి.. జల్‌శక్తి సదస్సులో మోదీ
- నీటి ప్రాజెక్టులకు వేగం.. వర్షపు నీటి సంరక్షణకు ప్రజల భాగస్వామ్యం

3



## రాహుల్ 'ఛాత్రోన్ కీ గూంజ్'కు బ్రేక్

- ఇండోర్ సభ వేదికపై వివాదం.. సెప్టెంబర్ 19కి వాయిదా
- నెహ్రూ స్టేడియానికి అనుమతి నిరాకరణ..
- ప్రత్యామ్నాయ వేదికగా రీజినల్ పార్క్ 'మెరుగైన ఏర్పాట్ల కోసమే వాయిదా'.. కాంగ్రెస్

3





# సీఎంపై కొండా సమరం!



- 'నాపై చర్యలకంటే ముందు రేవంత్‌పై చర్యలు తీసుకోండి'
- ఖర్గేతో సురేఖ భేటీ.. 'పదేళ్లు సీఎంగా ఉంటానని ఎలా అంటారు?' అంటూ ప్రశ్నలు
- కూతురి వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని విజ్ఞప్తి.. రాజీనామా కోరలేదన్న మంత్రి

**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి డెస్క్)** తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మధ్య నెలకొన్న వివాదం ఢిల్లీకి చేరడంతో కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ఉత్కంఠ నెలకొంది. క్రమశిక్షణ చర్యలపై చర్చ జరుగుతున్న వేళ సురేఖ నేరుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### 'ముందు సీఎంపై చర్యలు తీసుకోండి'

తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే ముందు సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సురేఖ కోరారు. రేవంత్‌రెడ్డి పదేళ్లపాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలు పార్టీ క్రమశిక్షణ పరిధిలోకి రావా అని నిలదీశారు. తనపై, ఇతర నేతలపై పార్టీ వ్యవహరిస్తున్న తీరులో ఒకే ప్రమాణాలు ఉండాలని ఆమె అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిపారు.

(తరువాయి 2లో)



## ఢిల్లీ నుంచి తెలంగాణకు గుడ్‌న్యూస్!

- విమానాశ్రయాలపై కేంద్రంతో రేవంత్ చర్చలు.. భద్రాద్రి ఎయిర్‌పోర్ట్‌కు కీలక ముందడుగు
- సెప్టెంబర్ 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన.. 4-5 ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన
- మోదీ సమక్షంలో జాతీయ ప్రాధాన్యతలపై కీలక భేటీ.. తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర-రాష్ట్ర ఫోకస్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):** తెలంగాణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలో జలశక్తి శాఖ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొంటున్న వేళ.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, విమానాశ్రయాల అభివృద్ధి, పెట్టుబడులు, రక్షణ రంగ అవకాశాలపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

### భద్రాద్రికి విమానాశ్రయ 'టేకాఫ్'

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయాలన్న చిరకాల డిమాండ్‌కు కీలక ముందడుగు పడింది.

(తరువాయి 2లో)



## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్

- 420 హామీల్లో ఏమైంది?.. ఆరు గ్యారంటీల అమలేది?
- కేటీఆర్ ఫైర్.. హరీశ్‌రావు సవాల్
- రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ సమరభేరి.. ప్రజల్లోకి 'బాకీ కార్డులు'

2

## వైఎస్సార్ వర్ధంతి.. ఇడుపులపాయలో భావోద్వేగం



- ఘాట్ వద్ద జగన్, షర్మిల నివాళులు.. తండ్రిని గుర్తుచేసుకుంటూ భావోద్వేగ సందేశాలు
- 'నాన్నా.. మిమ్మల్ని ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాను' : జగన్
- 'మరణం లేని మహానేత.. కోట్లాది ప్రజల గుండెల్లో చెరగని స్థానం' : షర్మిల

3

## కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయి!

- 1000 రోజుల్లో చేసిందేమీ లేదు.. మిగిలిన 750 రోజుల్లో ఏం చేస్తారు? : రామచందర్‌రావు
- బీజేపీపై దాడులు ఆపాలి.. తెలంగాణను మరో పశ్చిమ బెంగాల్‌గా మార్చొద్దు
- సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించకపోవడం ఓటుబ్యాంకు రాజకీయాలే



**భువనగిరి/పరకాల, సెప్టెంబర్ 2 (నవజ్యోతి డెస్క్):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్నా రాష్ట్రానికి చేసిందేమీ లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు విమర్శించారు. ఇంకా 750 రోజుల పాలన మిగిలి ఉందని, ఈ కాలంలో కాంగ్రెస్ ఏం చేయబోతోందో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. బుధవారం భువనగిరిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ కార్యాలయాలపై దాడులు పెరిగాయని ఆరోపించారు.

(తరువాయి 2లో)



## పవన్‌కు మోదీ చంద్రబాబు ప్రశంసల జల్లు

2

- 'ఎన్‌డీఏ సుపరిపాలనకు ఊతమిస్తున్నారు'.. ప్రధాని అభినందనలు
- 'గ్రామాల అభివృద్ధిలో మార్పు తెస్తున్నారు'.. పవన్‌కు బాబు ప్రశంసలు
- 55వ పుట్టినరోజు సందర్భంగా రాజకీయ, సినీ ప్రముఖుల శుభాకాంక్షలు

## వెయ్యి రోజుల పాలన.. సంక్షేమంలో సక్సెస్



- మా పథకాలపై చర్చకు బీఆర్ఎస్, బీజేపీ సిద్ధమా?: జగ్గారెడ్డి
- ఉచిత బస్సు ఎక్కుదాం.. ఇందిరమ్మ ఇళ్లున్న గ్రామాలకు వెళ్దాం

3

## జాతీయ జల భద్రత కోసం ఏకీకృత విధానం అవసరం: ఉత్తమ్ కుమార్ రెడ్డి



- ప్రతి జల సంరక్షణ ఆస్తికి ప్రత్యేక గుర్తింపు, బాధ్యతాయుత సంస్థ ఉండాలి
- సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్ల పునరుద్ధరణకు కేంద్ర సహాయం కోరిన మంత్రి
- ఏఐ ఆధారిత నీటి నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన

3

## ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు!

- పోలవరం ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదల.. పాయకరావుపేటలో శిలాఫలకం ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

2



# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై సమరశంఖం పూరించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు, వివిధ వర్గాలకు చేసిన వాగ్దానాల అమలుపై ప్రశ్నలు సంధిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభాపక్ష ఉపనేత టి. హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు.




### కేటీఆర్: '100 రోజుల్లో స్వర్గం అన్నారు.. 1000 రోజుల్లో నరకం చూపించారు'

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తీవ్రంగా ప్రశ్నించారు. 100 రోజుల్లో ప్రజలకు స్వర్గం చూపిస్తామని చెప్పిన కాంగ్రెస్.. 1000 రోజుల్లో నరకం చూపించిందని విమర్శించారు. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను నమ్మించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును పట్టించుకోలేదని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం చేసిన అప్పులు, ఖర్చులు, అమలు చేయని హామీలపై ప్రజలకు లెక్క చెప్పాలని డిమాండ్‌చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు, రుణమాఫీ, రైతుబంధు, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, పింఛన్లు తదితర అంశాలపై ప్రభుత్వం సమా ధానం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నియోజకవర్గాల వారీగా ప్రజల ముందుంచుతామని, హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ తెలిపారు.

### హరీశ్‌రావు: 'కేసీఆర్ నిర్మించిన తెలంగాణను కూల్చేస్తున్నారు'

బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అభివృద్ధి వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి బాటలో నడిపితే.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్తోందని హరీశ్‌రావు విమర్శించారు. విద్యుత్, సాగునీరు, వ్యవసాయం, వైద్యం, విద్య, తాగునీరు తదితర రంగాల్లో గత ప్రభుత్వ పనితీరును ప్రస్తుత పరిస్థితులతో పోల్చాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, ఉద్యోగులు, పింఛన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### 'అసెంబ్లీలో చర్చకు సిద్ధం'

కాంగ్రెస్ ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై అసెంబ్లీలో సమగ్ర చర్చకు సిద్ధమని ప్రకటించారు. రెండు ప్రభుత్వాల పనితీరును ప్రజల ముందు లెక్కలతో ఉంచాలని డిమాండ్ చేశారు.

### ప్రజల్లోకి బీఆర్ఎస్

ఛార్జ్‌షీట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ వారం రోజుల కార్యక్రమాలను ప్రకటించింది. నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, ర్యాలీలు, మానవహారాలు నిర్వహించడంతోపాటు కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో అమలు కానివాటిని 'బాకీ కార్డులు' రూపంలో ప్రజలకు అందించనుంది. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, దివ్యాంగులు, ఆటో కార్మికులు తదితర వర్గాల సమస్యలను విడివిడిగా ప్రస్తావిస్తూ నిరసనలు చేపట్టనుంది. 420 హామీలపై భారీ బ్యానర్లతో ప్రచారం నిర్వహించనుంది.

### కాంగ్రెస్ కౌంటర్

బీఆర్ఎస్ విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌పై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. అది ఛార్జ్‌షీట్ కాదని, అబద్ధాల పత్రం అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. బీఆర్ఎస్ ఆరోపణలకు ప్రభుత్వం, మంత్రులుఇచ్చే సమాధానాలతో తెలంగాణ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో మరింత వేడి పెరిగే అవకాశం ఉంది.

# కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయి!

(మొదటి పేజీ తరువాయి)

### 'బీజేపీపై దాడులు ఆపాలి'

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రాజకీయ హింసకు ప్రోత్సాహం ఇస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడి, ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసిన ఘటనను ప్రస్తావించారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ కార్యాలయాలపై దాడులను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ హింసకు చోటు ఉండకూడదని స్పష్టం చేశారు. ఇటీవల నల్గొండ వెళ్లి వర్షిత్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రయత్నించిన తనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంపైనా రామచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రజాస్వామ్య వాతావరణం దెబ్బతింటోందని ఆరోపించారు.

### 'తెలంగాణను పశ్చిమ బెంగాల్‌గా మార్చొద్దు'

రాష్ట్రంలో బీజేపీపై జరుగుతున్న దాడులు ఆందోళనకరంగా ఉన్నాయని రామచందర్‌రావు అన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణను మరో పశ్చిమ బెంగాల్‌గా మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. సంత్ రవిదాస్ చిత్రపటాన్ని నల్లరంగుతో ధ్వంసం చేసిన ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు.

### సెప్టెంబర్ 17పై కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రశ్నలు

తెలంగాణ విలీన దినోత్సవం సెప్టెంబర్ 17ను కాంగ్రెస్, గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించకపోవడాన్ని రామచందర్‌రావు తప్పుబట్టారు. ఓటుబ్యాంకు రాజకీయాలు, ఎంఐఎం భయంతోనే ఈ రెండు పార్టీలు సెప్టెంబర్ 17 ప్రాధాన్యాన్ని విస్మరిస్తున్నాయని ఆరోపించారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17 ప్రాధాన్యాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చడంతో పాటు అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించారు.

### అమరుల త్యాగాలను స్మరించుకుంటూ

పరకాలలోని అమరధామం, జలియన్‌వాలాబాగ్‌లో తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారికి రామచందర్‌రావు నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అమరుల త్యాగాలను ఎప్పటికీ మర్చిపోమని అన్నారు. పరకాల ఘటనను దక్షిణ భారత దేశ జలియన్‌వాలాబాగ్‌గా అభివర్ణించారు.

### 'సడక్ సే సదన్ తక్'

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తెలంగాణ బీజేపీకి పిలుపునిచ్చారు. రామచందర్‌రావు నేతృత్వంలో రాష్ట్ర బీజేపీ చేస్తున్న పోరాటాలను ఆయన ప్రశంసించారు. 'సడక్ సే సదన్ తక్' పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనను లక్ష్యంగా చేసుకోవడంతో పాటు.. బీజేపీపై దాడులు, సెప్టెంబర్ 17 వేడుకల అంశాలను ముందుకు తెచ్చిన రామచందర్‌రావు వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి అధికార–ప్రతిపక్షాల మధ్య వేడిని పెంచాయి.

# ఢిల్లీ నుంచి తెలంగాణకు గుడ్‌న్యూస్!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదేశాలతో కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణకు రానుంది. జిల్లాలో ప్రతిపాదించిన 4 నుంచి 5 ప్రత్యామ్నాయ స్థలాలను ఈ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. గతంలో పరిశీలించిన రెండు ప్రాంతాలు సాంకేతిక కారణాలతో అనుకూలంగా లేవని తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నాలుగు నుంచి ఐదు ప్రాంతాలను ప్రతిపాదించింది. భౌగోళిక, వాతావరణ పరిస్థితులు, రన్‌వే నిర్మాణానికి అనుకూలత, భూముల లభ్యత, ఇతర సాంకేతిక అంశాలను కేంద్ర బృందం పరిశీలించనుంది. నివేదిక అనుకూలంగా వస్తే తదుపరి ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంది.

### సీతంపేట, సుజాతనగర్ ముందంజ

ప్రాథమిక సాధ్యాసాధ్యాల అధ్యయనంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతంపేట, సుజాతనగర్ ప్రాంతాలు అత్యంత అనుకూలంగా గుర్తించినట్లు గతంలో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఆరు ప్రాంతాలను పరిశీలించిన అధ్యయనంలో ఈ రెండు ప్రాంతాలు మెరుగైన స్కోరు సాధించాయి. సుమారు 667 ఎకరాలు విమానాశ్రయ అవసరాలకు అభివృద్ధి చేయగల అవకాశముందని అధ్యయనం పేర్కొంది. అయితే తుది నిర్ణయం కేంద్ర సాంకేతిక పరిశీలన, తదుపరి అనుమతులపై ఆధారపడి ఉంటుంది.

### భక్తులు, పరిశ్రమలకు కొత్త కనెక్టివిటీ

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి దేశవ్యాప్తంగా భక్తులు వస్తుండటంతో విమానాశ్రయం ఏర్పాటైతే పర్యాటక, ఆధ్యాత్మిక రంగాలకు భారీ ఊతం లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సింగరేణి, హెవీ వాటర్ ప్లాంట్ తదితర పరిశ్రమలు ఉన్న భద్రాద్రి ప్రాంతానికి మెరుగైన విమాన కనెక్టివిటీ పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలకు కూడా దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు.

### రేవంత్ వరుస భేటీలు

మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో సమావేశమై రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధిపై చర్చించారు. ముఖ్యంగా మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలని కోరారు. విమానాశ్రయాల విస్తరణతో పాటు రాష్ట్ర పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ పూర్తయి భూమిని అప్పగించినట్లు సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ పనులపైనా త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### రక్షణ రంగంలోనూ తెలంగాణకు బూస్ట్

సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తోనూ సమావేశమయ్యారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్ సమీపంలోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు హాజరు కావాలని ఆయనను ఆహ్వానించారు. ప్రతిపాదిత డిఫెన్స్ ఎక్స్‌పోలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యం కావాలని కోరారు.

### ఢిల్లీలో మోదీ కీలక కార్యక్రమం

ఇదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలో జలశక్తి శాఖ నిర్వహిస్తున్న రెండు రోజుల డిపార్ట్‌మెంటల్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నారు. నీటి మౌలిక వసతుల ప్రాజెక్టుల అమలు, జల్ సంచయ్–జన్ భాగీదారీ, తాగునీటి వనరుల సుస్థిరత, జల్ జీవన్ మిషన్–2.0 వంటి అంశాలపై కేంద్రం–రాష్ట్రాల మధ్య సమన్వయంపై సదస్సులో చర్చ జరిగింది.

### తెలంగాణకు కీలక దశ

ఒకవైపు ప్రధాని స్థాయిలో కేంద్ర–రాష్ట్ర సమన్వయంపై దృష్టి పెడుతుండగా.. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కేంద్ర మంత్రులతో రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపై చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్‌కు కేంద్ర సాంకేతిక బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు రావడం ప్రాజెక్టు ముందుకు కదులుతున్న సంకేతంగా భావిస్తున్నారు. సెప్టెంబర్ 7న కేంద్ర బృందం ఇచ్చే నివేదికే భద్రాద్రి ఎయిర్‌పోర్ట్ భవితవ్యానికి కీలకం కానుంది. నివేదిక అనుకూలంగా వస్తే స్థల ఎంపిక, తదుపరి సాంకేతిక ప్రక్రియలు, అనుమతుల దిశగా అడుగులు పడే అవకాశం ఉంది. దీంతో భద్రాచలం–భద్రాద్రి ప్రాంత ప్రజల చిరకాల విమానాశ్రయ కలకు మరింత ఆశలు చిగురిస్తున్నాయి.

# ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు!

అనకాపల్లి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):

ఉత్తరాంధ్ర దశాబ్దాల కల సాకారమైంది. పోలవరం ఎడమ ప్రధాన కాల్వ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు చేరాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాల్వ క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోదావరి జలాలను విడుదల చేశారు. అంతకుముందు ఏరియల్ వ్యూ ద్వారా కాల్వను పరిశీలించిన ఆయనకు జిల్లా నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు అందుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. కాల్వ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 9 లక్షల మందికి తాగునీరు అందించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అనకాపల్లి జిల్లాలో ఏలేరు కాల్వతో పాటు 110 చెరువులను గోదావరి జలాలతో నింపనున్నారు. పుష్కర ఆయకట్టు పరిధిలో 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా కింద 12 వేల ఎకరాలతో పాటు తాండవ, వరహా, మామిడి గెడ్డ ఆయకట్టు పరిధిలో 46,620 ఎకరాలకు నీటి స్థిరీకరణ చేపట్టనున్నారు.



పోలవరం ఎడమ కాల్వ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్లు ఖర్చు చేసింది. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో సాగు, తాగునీరు, పారిశ్రామిక అవసరాల కోసం మొత్తం 23.44 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతో ఉత్తరాంధ్రలో సాగునీటి లభ్యతతో పాటు తాగునీటి అవసరాలకు కూడా గణనీయమైన ప్రయోజనం కలగనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, పి. నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కాల్వ వద్దకు చేరుకున్న రైతులు, స్థానిక ప్రజలు గోదావరి జలాలకు పూలు, హారతులతో స్వాగతం పలికారు.

# సీఎంపై కొండా సమరం!

(మొదటి పేజీ తరువాయి)

### కూతురి వ్యాఖ్యలపై వివరణ

తన కుమార్తె కొండా సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని సురేఖ స్పష్టం చేశారు. ఆమెకు పెళ్లయిందని, స్వతంత్రంగా జీవిస్తున్న వ్యక్తి అని పేర్కొన్నారు. కూతురు చేసిన వ్యాఖ్యల కారణంగా తనపై ఎందుకు చర్యలు తీసుకోవాలని ప్రశ్నించారు. మహిళలు స్వతంత్రంగా జీవించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెబుతున్నారని, అదే సూత్రం తన కుమార్తె విషయంలోనూ వర్తించాలని అన్నారు.

### 'ఇప్పటివరకు రాజీనామా అడగలేదు'

తనను మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఇప్పటివరకు అధిష్ఠానం కోరలేదని సురేఖ వెల్లడించారు. ఖర్గేను కలసి తన వివరణ ఇచ్చానని, పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయం కోసం వేచి చూస్తున్నానని తెలిపారు. కేసీ వేణుగోపాల్‌తో తనకు ఇంకా చర్చ జరగలేదని ఆమె చెప్పారు.

### బీసీ అంశాన్ని ముందుకు తెచ్చిన సురేఖ

తనపై చర్యలు తీసుకుంటే బీసీలు ఏకమయ్యే అవకాశం ఉందని సురేఖ వ్యాఖ్యానించారు. బీసీమహిళా మంత్రిగా తనపైఒక రకమైన ప్రమాణం, ఇతర సామాజిక వర్గాల నేతలపై మరో రకమైన ప్రమాణం ఎందుకు అని ప్రశ్నించారు. తనపై వచ్చిన ఆరోపణలతో పాటు ఇతర మంత్రులు, నేతలపై వచ్చిన ఆరోపణలను కూడా సమానంగా పరిశీలించాలని అధిష్ఠానాన్ని కోరారు.

### రేవంత్ వాదన ఏమిటి?

మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమై కొండా సురేఖ వ్యవహారంపై తన అభిప్రాయాన్ని వెల్లడించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీలో క్రమశిక్షణను కాపాడేందుకు చర్యలు అవసరమని ఆయన అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సైతం సురేఖ వ్యవహారంపై సిఫారసు చేసిన నేపథ్యంలో తుది నిర్ణయం అధిష్ఠానం చేతుల్లో ఉంది.

### అధిష్ఠానం ముందున్న అసలు ప్రశ్న

సురేఖపై చర్య తీసుకోవాలా? లేక ఆమె వివరణను పరిగణనలోకి తీసుకుని వివాదాన్ని సర్దుబాటు చేయాలా? అన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. సురేఖపై చర్యకు ముందు ఆమె వాదన వినాలని కొందరు ఏఐసీసీ నేతలు, రాష్ట్రానికి చెందిన నాయకులు అధిష్ఠానానికి సూచించినట్లు సమాచారం. మరోవైపు చర్య తీసుకోకపోతే పార్టీలో క్రమశిక్షణకు తప్పుడు సంకేతం వెళ్తుందన్న వాదన కూడా ఉంది.

### కేబినెట్ భవితవ్యంపైనా ఉత్కంఠ

సురేఖ వ్యవహారం కేవలం వ్యక్తిగత వివాదంగా కాకుండా రాష్ట్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణతోనూ ముడిపడింది. ఆమెను కేబినెట్ నుంచి తప్పించే అవకాశం ఉందన్న ఊహాగానాలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశంపై అధిష్ఠానం నుంచి ఇప్పటివరకు తుది నిర్ణయం వెలువడలేదు. సురేఖ మాత్రం తనను రాజీనామా చేయాలని ఎవరూ కోరలేదని స్పష్టం చేశారు. ఢిల్లీ పరిణామాలతో తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ ఉత్కంఠ మరింత పెరిగింది. రేవంత్ నాయకత్వాన్ని అధిష్ఠానం ఎలా చూస్తుంది? సురేఖపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఇద్దరి మధ్య వివాదానికి సర్దుబాటు పరిష్కారం చూపుతుందా? అన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

## పవన్‌కు మోదీ–చంద్రబాబు ప్రశంసల జల్లు



అమరావతి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కల్యాణ్ 55వ జన్మదినం సందర్భంగా రాజకీయ, సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు పవన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పాలనలో ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు.

### 'ఎన్‌డీఏ పాలనకు పవన్ ఊతం'

ప్రధాని నరేంద్ర మోదీ పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ.. ప్రజల్లో ఆయనకు విశేష గౌరవం ఉందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీఏ సుపరిపాలనకు ఊతమిచ్చే కృషిలో పవన్ ముందున్నారని ప్రశంసించారు. ప్రజాసేవలో ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయువు కలగాలని ఆకాంక్షించారు. మోదీ సందేశానికి పవన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని ప్రోత్సాహం ప్రజాసేవలోతన సంకల్పాన్ని బలపరుస్తుందని పేర్కొన్నారు.

### 'గ్రామాల్లో మార్పు తెస్తున్నారు'

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా పవన్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో చేపడుతున్న సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో మార్పు తీసుకొస్తున్నారని ప్రశంసించారు. రహదారుల నిర్మాణం, పచ్చదనం పెంపు, గిరిజనుల సమస్యల పరిష్కారం వంటి కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పవన్ కీలకంగా పనిచేస్తున్నారని చంద్రబాబు అన్నారు.

### అమిత్ షా అభినందనలు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎన్‌డీఏ లక్ష్యాలను అమలు చేయడంలో పవన్ చేస్తున్న కృషిని అభినందించారు. ప్రజాసేవను కొనసాగించేందుకు ఆయనకు మంచి ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు.

### జనసేన శ్రేణుల సంబరాలు

పవన్ జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జనసేన శ్రేణులు, అభిమానులు భారీగా వేడుకలు నిర్వహించారు. విజయవాడలో ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలో బైక్ ర్యాలీ నిర్వహించగా.. మార్కాపురంలోనూ భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పవన్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

### పార్టీ–పాలన.. రెండు బాధ్యతలు

జనసేన పార్టీ అధ్యక్షుడిగా రాజకీయ బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్.. రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు బాధ్యత వహిస్తున్నారు. జన్మదినం సందర్భంగా వచ్చిన రాజకీయ నేతల సందేశాల్లోనూ ఆయన పార్టీ నాయకత్వంతో పాటు పాలనలో చేస్తున్న కృషే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. పవన్ 55వ జన్మదినం సందర్భంగా మోదీ, అమిత్ షా, చంద్రబాబు నుంచి వచ్చిన ప్రశంసలు.. ఎన్‌డీఏ కూటమిలో ఆయనకు ఉన్న రాజకీయ ప్రాధాన్యాన్ని మరోసారి చాటాయి.

# జల భద్రతే.. దేశ భద్రత!




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**

దేశంలో నీటి భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో రెండు రోజులుగా జరిగిన జల భద్రతపై తొలి డిపార్ట్‌మెంటల్ సదస్సు ముగింపు కార్యక్రమంలో బుధవారం మోదీ పాల్గొని ప్రసంగించారు. జాతీయ ప్రాధాన్యతలను సాధించడంలో 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో కేంద్రం–రాష్ట్రాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు.

### కేంద్రం-రాష్ట్రాల సమన్వయమే కీలకం

ప్రధాని ఆలోచనతో ప్రారంభమైన డిపార్ట్‌మెంటల్ సదస్సుల పరంపరలో ఇది తొలి సమావేశం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ నాయకత్వం, ఉన్నతాధికారులు ఒకే వేదికపై సమావేశమై రంగాల వారీ సమస్యలు, అమలులో ఉన్న అడ్డంకులు, ఉత్తమ విధానాలపై చర్చించి కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం ఈ సదస్సు లక్ష్యం. కేవలం విధానాలను రూపొందించడం కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో వేగంగాఅమలు చేసి ప్రజలకు స్పష్టమైన ఫలితాలు అందించడంపై దృష్టి పెట్టాలని కేంద్రం సూచించింది. జలరంగంలో కేంద్రం, రాష్ట్రాలు, స్థానిక సంస్థలు,ప్రజల భాగస్వామ్యంతోసమగ్రవిధానంఅవసరమనిసదస్సులో చర్చించారు.

### నీటి ప్రాజెక్టులకు వేగం

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నీటి మౌలిక వసతుల ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంపై సదస్సులో ప్రధానంగా చర్చ జరిగింది. వివిధ శాఖలు, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచి ప్రాజెక్టుల అమలులో ఆలస్యాలను తగ్గించాలని నిర్ణయించారు.

### 'క్యాచ్ ద రెయిన్'కు ప్రజల భాగస్వామ్యం

వర్షపు నీటిని ఒడిసిపట్టడం, నీటి సంరక్షణ చర్యల్లో ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 'జల్ సంచయ్–జన్ భాగీదారీ–క్యాచ్ ద రెయిన్' కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్, స్థానిక నీటి వనరుల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు.

### తాగునీటి వనరుల సుస్థిరత

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిరంతరం కొనసాగేందుకు నీటి వనరుల సుస్థిరతపై దృష్టి పెట్టాలని సదస్సులో చర్చించారు. కేవలం పైపులైన్ ఏర్పాటు చేయడమే కాకుండా నీటి వనరులు దీర్ఘకాలం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించారు.

### జల్ జీవన్ మిషన్–2.0పై ఫోకస్

జల్ జీవన్ మిషన్–2.0 కింద గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ, పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడంపైనా చర్చ జరిగింది. ఇప్పటికే ఏర్పాటు చేసిన నీటి సరఫరా మౌలిక వసతులు సక్రమంగా పనిచేసేలా నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు.

### చర్చలు.. కార్యాచరణగా మారాలి

సదస్సులో రాష్ట్రాలు తమ అనుభవాలు, సమస్యలు, విజయవంతమైన విధానాలను పంచుకున్నాయి. ఆయా అంశాలపై చర్చలను కేవలం సమావేశాలకే పరిమితం చేయకుండా స్పష్టమైన లక్ష్యాలు, కాలపరిమితులు, బాధ్యతలతో కూడిన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని నిర్ణయించారు.

### 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో ముందుకు

నీటి సమస్య రాష్ట్రాల సరిహద్దులకు పరిమితమైన అంశం కాదని, దేశవ్యాప్తంగా సమన్వయంతో పరిష్కరించాల్సిన జాతీయ ప్రాధాన్యత అని కేంద్రం పేర్కొంది. నీటి మౌలిక వసతుల అభివృద్ధి, వర్షపు నీటి సంరక్షణ, తాగునీటి వనరుల పరిరక్షణ, గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థల మెరుగుదలలో కేంద్రం–రాష్ట్రాలు కలిసి పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నది సదస్సు ప్రధాన సందేశంగా నిలిచింది. జల భద్రతను 'టీమ్ ఇండియా' లక్ష్యంగా మార్చి.. నిర్ణయాలను క్షేత్రస్థాయి ఫలితాలుగా మార్చాలన్న మోదీ పిలుపుతో తొలి డిపార్ట్‌మెంటల్ సదస్సు ముగిసింది.

## వెయ్యి రోజుల పాలన.. సంక్షేమంలో సక్సెస్

- మా పథకాలపై చర్చకు బీఆర్ఎస్, బీజేపీ సిద్ధమా?: జగ్గారెడ్డి
- ఉచిత బస్సు ఎక్కుదాం.. ఇందిరమ్మ ఇళ్లున్న గ్రామాలకు వెళ్దాం
- సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై ప్రజల మధ్యే తేల్చుకుందాం

**హైదరాబాద్, సెప్టెంబర్ 02, నవజ్యోతి ప్రతినిధి :**




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ పథకాల విషయంలో విజయవంతంగా ముందుకు సాగుతోందని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో ప్రకటించిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య చికిత్సకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నేతలు తమతో కలిసి గ్రామాలు, బస్తీలకు రావాలని జగ్గారెడ్డి సవాల్ చేశారు. మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించి ఉచిత ప్రయాణ పథకం అమలును పరిశీలిద్దామని, ఇందిరమ్మ ఇళ్లు పొందిన గ్రామాల్లో ప్రజలతోనే మాట్లాడదామని అన్నారు. సిరిసిల్ల, సిద్ధిపేటలోనూ సంక్షేమ పథకాలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థులు, యువత చేసిన త్యాగాలను విస్మరించరాదని జగ్గారెడ్డి అన్నారు. విద్యార్థుల బలిదానాలను చూసి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం ఏ ఒక్క కుటుంబానికో పరిమితం కాదని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ పాలనతో రాష్ట్ర ఖజానాపై తీవ్ర ఆర్థిక భారం పడిందని ఆరోపించిన ఆయన, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తోందన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని కోరుతున్న కేటీఆర్ ముందుగా తమ పార్టీలోని అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. "మా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల మధ్యే చర్చకు సిద్ధం.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు కూడా సిద్ధమైతే రావాలి" అని జగ్గారెడ్డి సవాల్ చేశారు.

## రాహుల్ 'ఛాత్రోన్ కీ గూంజ్'కు బ్రేక్



**ఇండోర్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి డెస్క్):**

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొనాల్సిన 'ఛాత్రోన్ కీ గూంజ్' విద్యార్థి కార్యక్రమం వాయిదా పడింది. తొలుత సెప్టెంబర్ 12న ఇండోర్‌లోని నెహ్రూ స్టేడియంలో నిర్వహించేందుకు కాంగ్రెస్ అనుమతి కోరగా.. జిల్లా యంత్రాంగం అనుమతి నిరాకరించింది. దీంతో కార్యక్రమాన్ని సెప్టెంబర్ 19కి వాయిదా వేసి ప్రత్యామ్నాయ వేదిక కోసం దరఖాస్తు చేసింది.

### నెహ్రూ స్టేడియానికి ఎందుకు నో?

నెహ్రూ స్టేడియానికి సంబంధించిన కోర్టు వ్యవహారం పెండింగ్‌లో ఉండటంతో అక్కడ కార్యక్రమానికి అనుమతి ఇవ్వలేదని జిల్లా యంత్రాంగం వెల్లడించింది. దీంతో స్టేడియం నుంచి కార్యక్రమాన్ని మరో ప్రాంతానికి మార్చాలని కాంగ్రెస్ నిర్ణయించింది. రీజినల్ పార్క్‌ను ప్రత్యామ్నాయ వేదికగా ప్రతిపాదిస్తూ జిల్లా యంత్రాంగం, పోలీసులకు అనుమతి కోసం దరఖాస్తులు సమర్పించింది.

### 'వాయిదా.. మెరుగైన ఏర్పాట్ల కోసమే'

కార్యక్రమం వాయిదా పడటాన్ని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ మీడియా ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ముఖేశ్ నాయక్ ధ్రువీకరించారు. నెహ్రూ స్టేడియానికి అనుమతి లభించకపోవడంతో మరో వేదిక కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని సెప్టెంబర్ 19న నిర్వహించాలని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయించిందన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొనే అవకాశం ఉన్నందున మెరుగైన ఏర్పాట్ల కోసం అదనపు సమయం కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

### బీజేపీ-కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

రాహుల్ పర్యటన వాయిదా రాజకీయ వివాదానికి దారితీసింది. స్టేడియానికి అనుమతి నిరాకరణ వెనుక ప్రభుత్వ ఒత్తిడి ఉందని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తుండగా.. వేదికకు సంబంధించిన కోర్టు కేసు కారణంగానే అనుమతి ఇవ్వలేదని అధికారవర్గాలు స్పష్టంచేస్తున్నాయి. ఈఅంశంపై బీజేపీ,కాంగ్రెస్‌నేతలుపరస్పరంవిమర్శలుచేసుకుంటున్నారు.

### విద్యార్థులతో నేరుగా రాహుల్

విద్యార్థులు, యువతతో రాహుల్ గాంధీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడమే 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం ఉద్దేశమని కాంగ్రెస్ తెలిపింది. విద్య, ఉపాధి, యువత ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువతను సమీకరించేందుకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. ఇండోర్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కూడా బహిరంగ కార్యక్రమ ఏర్పాట్లపై ప్రభావం చూపుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమం కొత్త తేదీ ఖరారు కావడంతో సెప్టెంబర్ 19న నిర్వహణకు కాంగ్రెస్ ఏర్పాట్లు ప్రారంభించింది. వేదికపై అనుమతి వివాదంతో రాహుల్ గాంధీ విద్యార్థి కార్యక్రమం వాయిదా పడినా.. సెప్టెంబర్ 19న యువతతో నేరుగా మమేకమయ్యేలా కార్యక్రమాన్ని భారీస్థాయిలో నిర్వహించేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది.

## తెలంగాణ సంక్షేమమే ఆర్ఎస్‌పీ లక్ష్యం: జాకట శ్రీనివాస్

- ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలు, మధ్యతరగతి ప్రజలకు పూర్తిగా అందాలి

**మేడ్చల్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**

తెలంగాణ సంక్షేమ నిర్మాణంలో అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ (ఆర్ఎస్‌పీ) అధ్యక్షుడు, మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి జాకట శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం మేడ్చల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంక్షేమమే ఆర్ఎస్‌పీ ప్రధాన లక్ష్యమని తెలిపారు.



ప్రభుత్వ పథకాలు పేదలు, మధ్యతరగతి ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే అధికారులు పార్టీలకు అతీతంగా రాజ్యాంగబద్ధంగా, నిష్పక్షపాతంగా పనిచేయాలని కోరారు. సామాన్యుల వినతులను సత్వరమే పరిష్కరించిఅవినీతికితావులేకుండాచూడాలని సూచించారు.

## వైఎస్సార్ వర్ధంతి.. ఇడుపులపాయలో భావోద్వేగం



**కడప, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద బుధవారం భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఆయన కుమారుడు, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుమార్తె, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వేర్వేరుగా ఘాట్ వద్ద నివాళులర్పించారు. వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

### తండ్రిని తలచుకున్న జగన్

జగన్ తన తండ్రి సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయన వెంట సతీమణి వైఎస్ భారతి, తల్లి విజయమ్మ, ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు. అనంతరం సోషల్ మీడియా వేదికగా తండ్రిని స్మరించుకున్నారు. 'మిస్ యూ ఆల్వేస్ డాడ్.. మీరు ఎప్పటికీ నా స్ఫూర్తి' అంటూ జగన్ భావోద్వేగ సందేశం ఇచ్చారు. వైఎస్సార్ చూపిన ప్రజాసేవ మార్గం తనకు ఎప్పటికీ స్ఫూర్తిగా ఉంటుందని పేర్కొన్నారు.

### 'మరణం లేని మహానేత'

జగన్ ఘాట్ నుంచి వెళ్లిన అనంతరం షర్మిల అక్కడికి చేరుకుని తండ్రికి పుష్పాంజలి ఘటించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ కోట్లాది ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్న మహానేతగా షర్మిల అభివర్ణించారు. వైఎస్సార్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, జలయజ్ఞం, 108–104 అంబులెన్స్ సేవలు, వ్యవసాయ రుణమాఫీ వంటి కార్యక్రమాలను ఆమె గుర్తుచేశారు. ఈ పథకాలు పేదలు, రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని పేర్కొన్నారు.

### 'ఆయన ఆశయాలే స్ఫూర్తి'

వైఎస్సార్ సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడని జగన్–షర్మిల తమ సందేశాల్లో గుర్తుచేశారు. ఆయన ప్రజల కోసం ప్రారంభించిన కార్యక్రమాలను తమ తమ రాజకీయ వేదికల ద్వారా కొనసాగిస్తామని ఇరువురూ పేర్కొన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్ పంజాగుట్టలో తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు వైఎస్సార్‌కు నివాళులర్పించారు. 2004–2009 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్సార్ 2009 సెప్టెంబర్ 2న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. 17 ఏళ్లు గడిచినా ఆయన సంక్షేమ పథకాలు, రాజకీయ వారసత్వం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో చర్చనీయాంశంగానే కొనసాగుతున్నాయి.

## జాతీయ జల భద్రత కోసం ఏకీకృత విధానం అవసరం: ఉత్తమ్ కుమార్ రెడ్డి

**డెస్క్, సెప్టెంబర్ 2, (నవజ్యోతి ప్రతినిధి) :**




దేశ వ్యాప_్తంగా చేపడుతున్న నీటి సంరక్షణ కార్యక్రమాలన్నింటినీ ఒకే జాతీయ జల భద్రతా ప్రణాళిక పరిధిలోకి తీసుకురావాలని తెలంగాణ సాగునీటి, కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రతిపాదించారు. న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జల్ సంచయ్ జన భాగిదారి' సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి జల సంరక్షణ ఆస్తికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించడంతో పాటు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. నిధుల మూలం, నిర్వహణ బాధ్యత వహించే సంస్థ, సాధించిన ఫలితాలను కూడా దానితో అనుసంధానం చేయాలన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్, పీఎంకేఎస్‌వై, ఫైనాన్స్ కమిషన్, క్యాంపా, వాటర్‌షెడ్, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న పనుల్లో సమన్వయం అవసరమని పేర్కొన్నారు. నీటి సంరక్షణ పనుల విజయాన్ని నిర్మాణాల సంఖ్యతో కాకుండా ఎంత నీటి నిల్వ పెరిగింది, భూగర్భ జలాలు ఎంత పునరుద్ధరించబడ్డాయి, ఏడాది పొడవునా నీటి లభ్యత ఎంత మెరుగుపడిందనే అంశాల ఆధారంగా అంచనా వేయాలని సూచించారు. తెలంగాణలోని 44,360 చెరువులు, కుంటల్లో 28,739 చోట్ల పనులు చేపట్టి, 22,428 జల వనరుల పునరుద్ధరణ పూర్తి చేసినట్లు తెలిపారు. 'జల్ సంచయ్ జన భాగిదారి'లో 2025 సంవత్సరానికి తెలంగాణ ఉత్తమ రాష్ట్రంగా గుర్తింపు పొందిందని, రాష్ట్రంలోని 13 జిల్లాలు దేశంలోని అగ్ర 50 జిల్లాల్లో నిలిచాయని చెప్పారు. 2026–29 మధ్య రూ.46,110 కోట్లతో 17.28 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యాలు కల్పించే ప్రణాళిక అమలు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని 159 ప్రధాన, మధ్యతరహా రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం సుమారు 929 టీఎంసీలు కాగా, ఎంపిక చేసిన ప్రాజెక్టుల్లో పూడిక కారణంగా నిల్వ సామర్థ్యం తగ్గినట్లు అధ్యయనాల్లో తేలిందన్నారు. లోయర్ మానేరు, మిడ్ మానేరు, కడెం రిజర్వాయర్లలో పైలట్ డీసిల్టేషన్ పనులు చేపట్టామని తెలిపారు. వర్షపాతం అంచనాలు, రిజర్వాయర్ల నిర్వహణలో ఏఐ సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని కేంద్రాన్ని కోరారు. ప్రతి గ్రామం, పట్టణానికి ప్రత్యేక జల భద్రతా ప్రణాళిక రూపొందించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.

## వైఎస్సార్ ప్రజా సంక్షేమ పథకాలు చిరస్మరణీయం: బండి రమేష్



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. వైఎస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ వద్ద కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బండి రమేష్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో వైఎస్సార్ పేదల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ఆయన చూపిన ప్రజాసేవా మార్గంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తోందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేస్తూ పేదలు, రైతులు, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, రాఘవేంద్ర, అరవింద్‌రెడ్డి, కలికోట శంకర్, నాగార్జున, కృష్ణ రాజ్‌పుత్, సతీష్‌గౌడ్, గంధం రాజు, ఫణీంద్ర, సంధ్య, సుధాకర్‌రెడ్డి, ప్రకాష్ ముదిరాజ్, ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బసంత్‌నగర్ టోల్‌గేట్ వద్ద ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు



**పాలకుర్తి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి జిల్లా ప్రతినిధి):**

పాలకుర్తి మండలం బసంత్‌నగర్ టోల్‌గేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నాయకులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ఆయన పాలనలో కీలకంగా నిలిచాయని గుర్తుచేశారు. వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గడ్డం తిరుపతి, మాజీ ఎంపీపీ గంగాధర్ రమేష్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పర్శవేణి శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, వైఎస్సార్ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడ్చల్ సిఎంసి పరిధిలో మిషన్ భగీరథ కలుషిత నీళ్ల పంపిణి

### - పట్టించుకోని అధికారులపై ప్రజల ఆగ్రహం

**మేడ్చల్, సెప్టెంబర్ 02 (నవజ్యోతి ప్రతినిధి) :**



మేడ్చల్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలోని పలు కాలనీల్లో మిషన్ భగీరథ తాగునీరు తీవ్రంగా కలుషితమై వస్తోంది. అసలే అరకొరగా వస్తున్న నీరు, అందులోనూ మురికిగా, దుర్వాసనతో వస్తుండటంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని పలు వార్డుల్లో శుద్ధి చేయని ఈ మురికి నీటిని తాగి ప్రజలు వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ వంటి వివిధ రకాల జలజన్య వ్యాధుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే స్థానిక ప్రజలు సంబంధిత సిఎంసి అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు లిఖితపూర్వకంగా మరియు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న పరిస్థితి నెలకొందని వారు మండిపడుతున్నారు. అరకొరగా వస్తున్న నీటి సరఫరాను క్రమబద్ధీకరించాలని, పైప్‌లైన్లలో ఏ ప్రాంతంలో లీకేజీలు ఏర్పడ్డాయో గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం మరియు సిఎంసి అధికారులు స్పందించి, తక్షణ చర్యలు తీసుకుని సురక్షిత తాగునీటిని అందించాలని, లేనియెడల పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# ప్రజా పాలన కాదు.. ప్రజా వంచన పాలన

- రేవంత్ రెడ్డి గద్దె దిగే వరకు పోరాటం: జీవన్ రెడ్డి
- 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో జగిత్యాలలో బీఆర్ఎస్ నిరసన ర్యాలీ

**జగిత్యాల జిల్లా బ్యూరో (నవజ్యోతి దినపత్రిక):**





కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కొత్త బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పూలమాలలు వేసి ర్యాలీ ప్రారంభించారు. పార్టీ జెండాలు, ప్లకార్డులు చేతబట్టి కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రస్తావిస్తూ రూపొందించిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ప్రదర్శించారు. ప్రజలకు ఇవ్వాల్సిన ప్రయోజనాలను పేర్కొంటూ 'బాకీ కార్డులు' పంపిణీ చేశారు. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో "ప్రజా వంచన పాలన" సాగుతోందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రైతు బీమా, రైతు పెట్టుబడి సాయం, సాగునీరు, విద్యుత్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా మహిళలకు రూ.2,500, పెన్షన్ల పెంపు, వ్యవసాయ కూలీలు, ఆటో కార్మికులకు ఆర్థిక సాయం వంటి హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, బీసీ సంక్షేమం విషయంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. "ఇది ఆరంభం మాత్రమే. రేవంత్ రెడ్డి ప్రభుత్వం గద్దె దిగే వరకు పోరాటం కొనసాగిస్తాం. కేసీఆర్ రావాలి.. రేవంత్ రెడ్డి పోవాలి" అని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. విద్యాసాగర్ రావు, దావ వసంత సురేష్ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను అమలు చేసే వరకు ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### మోసకారి కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై

# బీఆర్ఎస్ సమరశంఖం





- 420 హామీలపై ప్రజలకు 'బాకీ కార్డులు' పంపిణీ.. 420 అడుగుల భారీ ఫ్లెక్సీ ప్రదర్శన
- హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తాం: బీఆర్ఎస్ నాయకులు

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో బుధవారం భారీ నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో రెడ్డి కాలనీలోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా బయలుదేరి ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన తెలిపారు. అనంతరం ధర్నా నిర్వహించి కాంగ్రెస్ ఎన్నికల హామీలను గుర్తుచేస్తూ ప్రజలకు 'బాకీ కార్డులు' పంపిణీ చేశారు. 420 హామీలను 420 అడుగుల భారీ ఫ్లెక్సీపై ముద్రించి ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.హామీల పేరుతో ప్రజలను మోసం చేశారు.
బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలుకు నోచుకోకుండా కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, వృద్ధులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, పేదలు, కార్మికులు, విద్యార్థులు తదితర అన్ని వర్గాలను హామీల పేరుతో మోసం చేశారని ఆరోపించారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రజల మధ్య పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### హామీలు అమలు చేసే వరకు పోరాటం

కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రచారాలు, మాటలకే పరిమితం కాకుండా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావడం ఒకసారి సాధ్యమైనా, సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. 420 హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, ఎం.డి. యూసుఫ్, దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎం.డి. ఇలియాస్‌ఖాన్, ధనావత్ చిట్టిబాబునాయక్, బైరం సంపత్, అంగోతు హతిరాం నాయక్, ఎం.డి. మగ్దూం పాషా, ఎం.డి. మాజీద్, ధనావత్ బాలాజీనాయక్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కుర్ర సేవ్యానాయక్, చౌగాని బిక్షంగౌడ్, కుందూరు వీరకోటిరెడ్డి, అమరావతి సైదులు యాదవ్, చిర్ర మల్లయ్య యాదవ్, పాలుట్ల బాబయ్యతో పాటు వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, పట్టణ కమిటీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయొద్దు

### మల్కాజ్‌గిరి సీపీ సుమతి ఐపీఎస్ కు ఎమ్మెల్యే మర్రి విజ్ఞప్తి



**అల్వాల్/సెప్టెంబర్ 2, (నవజ్యోతి ప్రతినిధి):**

బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలపై రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తప్పుడు కేసులు నమోదు చేయకుండా చూడాలని మల్కాజ్‌గిరి మర్రి రాజశేఖర్ రెడ్డి మల్కాజ్‌గిరి కమిషనర్ ఆఫ్ పోలీస్ సుమతి ఐపీఎస్ ని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీపీ సుమతి ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి,బీఆర్ఎస్ నాయకులపై ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు కేసులు నమోదు చేయకుండా పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ఇప్పటికే నమోదైన కేసుల విషయంలో కూడా వాస్తవాలను పరిశీలించి, చట్టపరమైన నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తిపై సీపీ సుమతి ఐపీఎస్ సానుకూలంగా స్పందించి,విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్,బీఆర్ఎస్ నాయకులు జేఏసీ వెంకన్న, హేమంత్ పటేల్,గౌస్,ఇమ్రాన్, బంటి,మాశెట్టి అనిల్, నర్సింగ్ రావు,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బూటకపు హామీలతో ప్రజలకు వంచన: ఎమ్మెల్యే మాధవరం



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**

వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచించిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు. దమ్ముంటే అభివృద్ధిపై ప్రజల సమక్షంలో తేల్చుకుందామని సవాల్ విసిరారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి పరిధిలో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4 వేల పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగులకు ఉద్యోగాలు, తులం బంగారం వంటి హామీలను విస్మరించిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో కల్యాణలక్ష్మి , కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలతో మహిళలకు అండగా నిలిచామని గుర్తుచేశారు. ఉచిత బస్సు పేరుతో కుటుంబాలపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. ఒక్కో కుటుంబానికి సుమారు రూ.5 లక్షల వరకు ప్రభుత్వం బాకీ పడిందని, ఆ వివరాలతో కూడిన 'బాకీ కార్డు'ను ప్రతి ఇంటికీ అందజేస్తామని తెలిపారు. బోయిన్‌పల్లిలోని పలు ప్రాంతాలను 22ఎ పరిధిలోకి తీసుకురావడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ఉచితంగా అందించిన తాగునీటికి ప్రస్తుతం బిల్లులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్, ఇర్ఫాన్, మక్కాల నర్సింగ్‌రావు, నరేందర్‌గౌడ్, ఎజాస్ పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్‌లో 70వ స్కూల్ గేమ్స్ సందడి

- ఈ నెల 7 నుంచి జోనల్ స్థాయి పోటీలు.. టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**



కుత్బుల్లాపూర్ జోన్‌లోని విద్యార్థి క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభించింది. 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలు, టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌ను ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జోనల్ సెక్రటరీ నాగరాజు గౌడ్ తెలిపారు. 7న బౌరంపేటలోని నయీమ్ క్రికెట్ అకాడమీ, కార్తికేయ క్రికెట్ గ్రౌండ్‌లో క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నారు. 9న బాచుపల్లిలోని సూర్య గ్లోబల్ స్కూల్‌లో కబడ్డీ, 10న ఖోఖో, 11న వాలీబాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. జోన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బాలబాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవాలని నాగరాజు గౌడ్ కోరారు.

### వయస్సు, బరువు అర్హతలు తప్పనిసరి

అండర్–14 విభాగంలో 2013 జనవరి 1న లేదా ఆ తర్వాత, అండర్–17 విభాగంలో 2010 జనవరి 1న లేదా ఆ తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. కబడ్డీలో అండర్–14 బాలురకు 51 కిలోలు, బాలికలకు 48 కిలోలు, అండర్–17 బాలురకు 57 కిలోలు, బాలికలకు 55 కిలోల బరువు పరిమితి ఉంటుందని పేర్కొన్నారు. క్రీడాకారుల వయస్సు, బరువు వివరాలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు, పీడీలు, పీఈటీలు ముందుగానే పరిశీలించాలని సూచించారు. ఎలిజిబిలిటీ ఫారాలు, బోనఫైడ్ ధ్రువపత్రాలను పూర్తి వివరాలతో సిద్ధం చేసి నిర్ణీత సమయంలో సమర్పించాలని కోరారు.

## మైనారిటీ మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం: పీఏసీ చైర్మన్ గాంధీ

- 278 మంది లబ్ధిదారులకు రూ.1.39 కోట్ల విలువైన చెక్కుల పంపిణీ

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**

మైనారిటీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన 278 మంది లబ్ధిదారులకు 100 శాతం సబ్సిడీతో రూ.1.39 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి అజారుద్దీన్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, ఎమ్మెల్యే శంకర్‌లతో కలిసి గాంధీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక్కో మహిళకు అందుతున్న రూ.50 వేల సాయం చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధికి తోడ్పడుతుందని గాంధీ తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచి మహిళలు స్వతంత్రంగా ఎదగడానికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. అనంతరం తుర్క కాశ మైనారిటీలకు రాతి కటింగ్



యంత్రాలు, పనిముట్లను అందజేశారు. ఆధునిక పరికరాలతో శ్రమ తగ్గి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

- నాగారంలో బీజేపీ అభిమానుల ఆధ్వర్యంలో వేడుకలు.. కేక్ కట్ చేసిన ఏనుగు సుదర్శన్‌రెడ్డి

**నాగారం, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**



పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నాగారంలో బీజేపీ అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేడ్చల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు, సేవా స్ఫూర్తి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు, మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాగారం డివిజన్ మాజీ జెడ్పీటీసీ సురేష్, బీజేపీ ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి వెంకటేశ్వరరావు (పీవీఆర్), ఉపాధ్యక్షుడు కర్ర వెంకటేశ్వర్ పటేల్, మేడ్చల్ జిల్లా నాయకులు సంపత్ యాదవ్, డాక్టర్ అనూష, వెంకటేష్, మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాంసాగర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల





- చివరి ఆయకట్టు వరకు ప్రతి ఎకరాకు నీరు: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

**బాన్సువాడ, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):** నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీటిని ప్రధాన కాలువకు విడుదల చేశారు. బుధవారం ప్రాజెక్టు వద్ద జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆయకట్టు చివరి భూముల వరకు ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం నిజాంసాగర్‌లో సుమారు 13.3 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని పోచారం తెలిపారు. రాష్ట్రంలో వర్షాకాల పంటలకు ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తున్న తొలి ప్రాజెక్టుగా నిజాంసాగర్ నిలుస్తోందన్నారు. ప్రాజెక్టు కింద సుమారు 1.30 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని, అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు. మొదట 15 రోజుల పాటు నీటిని విడుదల చేసి, పరిస్థితిని బట్టి వారం లేదా పది రోజుల విరామం అనంతరం మళ్లీ నీటిని విడుదల చేస్తూ చివరి పంట వరకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎగువ ఆయకట్టు రైతులు అధికంగా నీటిని వినియోగిస్తే దిగువ ప్రాంతాలకు ఇబ్బందులు ఏర్పడతాయని, అందువల్ల రైతులంతా పరస్పరం సహకరించుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. బాన్సువాడ, జుక్కల్, బోధన్ నియోజకవర్గాలతో పాటు నిజాంసాగర్ నీటిపై ఆధారపడిన ఆయకట్టు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి పంపిణీ చేపడుతున్నామని చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికారులు–రైతులు సమన్వయంతో పనిచేస్తే వర్షాకాల పంటలను కాపాడుకోవచ్చని పోచారం పేర్కొన్నారు. నీటి విడుదలతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

- ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ ఆదర్శం: మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు



**రామాయంపేట, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. పేదలు, రైతులు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసి ప్రజలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవ చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. వైఎస్సార్ సేవలను స్మరించుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మహానేతకు ఘన నివాళులు

- కొండ్రపోల్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):** కొండ్రపోల్ గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలు, రైతులు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ విశేష కృషి చేసిన మహానేత అని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన అమలు చేసిన పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం వైఎస్సార్ చూపిన సేవా మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు కీలకం: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**దామరచర్ల, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. దామరచర్ల మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీలను తిలకిస్తూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయని అన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి మండలానికి, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు, క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

## సొంత ఖర్చులతో లిఫ్ట్ మరమ్మతులు

**నడిగూడెం, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్):** గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఎల్–34 లిఫ్ట్ పంపులకు సర్పంచ్ దున్న శ్రీనివాస్ సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించి బుధవారం నీటిని విడుదల చేశారు. నడిగూడెం బస్టాండ్ సమీపంలోని సారంగయ్య చెరువులోకి నీరు చేరేలా చర్యలు చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెరువులను ముందుగానే నింపేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏలూగురి నాగరాజు, వార్డు సభ్యులు దున్న లింగయ్య, గుండు మహేందర్, కాసాని మాధవి, గోపీనాథ్, సరస్వతి, రాము, రైతు గుండు పాపయ్య, గ్రామ యువజన అధ్యక్షుడు పల్లపు గోపాల్, కాసాని శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు ఎక్కడ..?





- కాంగ్రెస్ బూటకపు హామీలతో ప్రజలకు వంచన.. 'బాకీ కార్డు'తో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం
- దమ్ముంటే అభివృద్ధిపై ప్రజల సమక్షంలో తేల్చుకుందాం: వంటేరు ప్రతాప్‌రెడ్డి

**తూప్రాన్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):** వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నెరవేర్చకుండా ప్రజలను వంచించిందని తూప్రాన్ బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. దమ్ముంటే అభివృద్ధిపై ప్రజల సమక్షంలో తేల్చుకుందామని సవాల్ విసిరారు. బుధవారం తూప్రాన్ పట్టణంలో కాంగ్రెస్ 'బాకీ కార్డులు', కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4 వేల పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగులకు ఉద్యోగాలు, తులం బంగారం వంటి హామీలను విస్మరించిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలతో ఆడబిడ్డలకు అండగా నిలిచామని గుర్తుచేశారు. ఉచిత బస్సు పేరుతో కుటుంబాలపై అదనపు భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. ఒక్కో కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.5 లక్షల వరకు బాకీ పడిందని ఆరోపిస్తూ, ఆ వివరాలతో రూపొందించిన 'బాకీ కార్డు'ను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సతీష్‌చారి, ఉమ్మడి మండల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఎదురుచూసిన వేళ..

## అధికారి గైర్హాజరు!

అధికారి వచ్చిన వేళ.. సమస్యలు చెప్పే ప్రజలే గైర్హాజరు!

- రాజీవ్ గృహకల్పలో అధికారుల పర్యటనపై స్థానికుల ప్రశ్నల



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):** ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు అధికారుల పర్యటనలు జరుగుతున్నాయా.. లేక పర్యటన జరిగినట్లు నమోదు చేసుకోవడానికే పరిమితమవుతున్నాయా అన్న ప్రశ్నలు సూరారం రాజీవ్ గృహకల్పలో తలెత్తుతున్నాయి. కొంపల్లి సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో మంగళవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య పర్యటిస్తారని అధికారులు ముందుగానే స్థానికులు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. దీంతో కాలనీలోని సమస్యలను నేరుగా అధికారికి వివరించేందుకు పలువురు స్థానికులు ఎదురుచూశారు. అయితే పర్యటన సమయానికి డిప్యూటీ కమిషనర్ రావడం లేదని సమాచారం అందడంతో స్థానికులు నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకుడు వారాల వినోద్‌కుమార్ కాలనీలోని పలు బ్లాక్‌లను సందర్శించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. వాటిని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లారు.

**- వార్తల తర్వాతే పర్యటన..?**

మంగళవారం డిప్యూటీ కమిషనర్ గైర్హాజరు, స్థానికుల అసంతృప్తిపై పత్రికల్లో వార్తలు వచ్చిన అనంతరం బుధవారం ఆమె రాజీవ్ గృహకల్పలో పర్యటించడం చర్చకు దారితీసింది. మంగళవారం ప్రజలు సమస్యలు చెప్పేందుకు ఎదురుచూసిన సమయంలో పర్యటన జరగకపోగా, బుధవారం స్థానికులు తమ పనులకు వెళ్లిన తర్వాత పర్యటించడంపై కాలనీవాసులు ప్రశ్నలు సంధిస్తున్నారు. ప్రజలు అందుబాటులో ఉన్న సమయంలో వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటేనే పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.పర్యటన వాయిదాకు కారణమేంటి.. ముందుగా నిర్ణయించిన మంగళవారం పర్యటన ఎందుకు జరగలేదు, డిప్యూటీ కమిషనర్ గైర్హాజరుకు కారణమేంటి, బుధవారం పర్యటన ఎందుకు నిర్వహించారనే అంశాలపై స్థానికుల్లో ప్రశ్నలు నెలకొన్నాయి. పర్యటన వాయిదాకు అనివార్య కారణాలున్నాయా, ఇతర కారణాలతోనే పర్యటన జరగలేదా అన్న దానిపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## వెయ్యి రోజుల పాలన.. వెయ్యి వైఫల్యాలు!





- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఉప్పల్‌లో బీఆర్ఎస్ భారీ ధర్నా.. గాడిదలతో వినూత్న నిరసన

**ఉప్పల్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలు, అమలు కాని హామీలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్ ఎక్స్ రోడ్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని అన్నారు. ధర్నాలో భాగంగా గాడిదలతో వినూత్న నిరసన చేపట్టడంతోపాటు 420 అడుగుల భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో బీఆర్ఎస్ భారీ నిరసన

- ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదు: మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్‌యాదవ్



**మేడ్చల్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలో భారీ నిరసన నిర్వహించారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడిచినా ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల సమస్యలను విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని భాస్కర్‌యాదవ్ తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## "హామీలు ఎక్కడ? అభివృద్ధి ఎక్కడ?"

- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నాగారంలో బీఆర్ఎస్ సమరశంఖం.. 420 అడుగుల బ్యానర్‌తో భారీ నిరసన
- ప్రజల పక్షాన బీఆర్ఎస్.. హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదు: మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



**నాగారం, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలు, అమలు కాని హామీలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ రాంపల్లి చౌరస్తాలో బుధవారం ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ధర్నాలో 420 అడుగుల భారీ బ్యానర్‌ను ప్రదర్శించి ప్రభుత్వ వైఫల్యాలను నిరసించారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కీసర మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు జలాల్‌పూరం సుధాకర్‌రెడ్డి, నాగారం డివిజన్ మాజీ అధ్యక్షుడు తెల్ల శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు కౌకుట్ల అనంత్‌రెడ్డి, మంగళపూరి వెంకటేష్, సీనియర్ నాయకులు గూడూరు ఆంజనేయులుగౌడ్, మాజీ వార్డు సభ్యులు సాయినాథ్‌గౌడ్, కొత్త భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## మహిళా నాయకురాలిపై పోలీసు అధికారి అసభ్య పదజాలం.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

- కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తెలంగాణ రక్షణ సేన నాయకుల ఆరోపణ




**మేడ్చల్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై ఓ పోలీసు అధికారి అసభ్యకర, అవమానకర పదజాలం ఉపయోగించారనే ఆరోపణలపై ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి గుర్రం వెంకట్ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళా నాయకురాలిపై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న పోలీసు అధికారి అనుచిత భాష ఉపయోగించడం సమర్థనీయం కాదని వారు అన్నారు. ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువజన అధ్యక్షుడు బండమీది నవీన్‌కుమార్ ముదిరాజ్, గాండికోట కుమార్, మహిళా అధ్యక్షురాలు కోల స్వర్ణ, క్రీడా విభాగం ప్రతినిధి ప్రేమ్‌సాగర్, మండల కార్మిక విభాగం అధ్యక్షుడు కోటగిరి నాగరాజ్, డాక్టర్ లక్ష్మణ్‌కుమార్, వరికాప్పుల సంతోష తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యార్థులకు అండగా.. చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కాలేజ్ బ్యాగుల పంపిణీ

- చేగుంటలో ముత్యంరెడ్డి ఏడో వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు బ్యాగుల అందజేత



**చేగుంట, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి ఏడో వర్ధంతి సందర్భంగా చేగుంట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలేజ్ బ్యాగులను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ముత్యంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 2009లో ముత్యంరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన నెల రోజుల్లోనే చేగుంటకు జూనియర్ కళాశాలను మంజూరు చేయించారని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని ఆరు జూనియర్ కళాశాలల్లో ఐదింటిని ఆయన కృషితోనే ఏర్పాటు చేశారని తెలిపారు. చేగుంటలో పాలిటెక్నిక్ కళాశాల, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటులో ముత్యంరెడ్డి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఓటుకు నోటు సంస్కృతి, అవినీతిని యువత చైతన్యంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం దసరా లోపు కళాశాలకు సొంత ఖర్చులతో 10 కంప్యూటర్లు అందిస్తానని, మైదానాన్ని పూర్తిస్థాయి స్టేడియంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ, ఓటములకు కుంగిపోకుండా లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంగళరావు, మండల అధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్, శ్రీ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ సంద్రుగు సతీష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొజామిల్, స్టాలిన్, బాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రమోద్‌కుమార్, అధ్యాపకులు, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలి: సర్పంచ్ దున్నా శ్రీనివాస్



**నడిగూడెం, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్):**
గ్రామంలోని ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు. నడిగూడెం నర్సరీలో పెంచిన మొక్కలను బుధవారం గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తూ నడిగూడెంను హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, వార్డు సభ్యులు నాగారపు సరస్వతి, రాము, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, మాజీ సర్పంచ్ చిల్లంచర్ల సత్యనారాయణ, గ్రామస్తులు పాతకోట్ల శ్రీనివాస్, గుండు వెంకన్న, గుండు శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులకు అండగా సమాచార హక్కు వికాస సమితి

- పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ వివాదం పరిష్కారం.. పోషణ, సంరక్షణ బాధ్యతపై ఒప్పందం



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా వారి పోషణ, సంరక్షణ బాధ్యతను పిల్లలు తీసుకోవాలని సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి సూచించా రు. మిర్యాలగూడ మండలం దుబ్బాతండాకు చెందిన భూక్యా మాల్సుర్ వృద్ధ దంపతుల కుటుంబ వివాదాన్ని సమితి ప్రతినిధులు చొరవ తీసుకుని పరిష్కరించారు. మిర్యాలగూడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద ఇబ్బందులు పడుతున్న వృద్ధ దంపతులను డాక్టర్ కృష్ణారెడ్డి, నల్గొండ జిల్లా అధ్యక్షుడు బైరు సైదులుగౌడ్ గుర్తించి వారి సమస్యను తెలుసుకున్నారు. తమకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, తమ భూములకు పిల్లలు పట్టా హక్కులు పొందిన అనంతరం తమను పట్టించుకోవడం లేదని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### పిల్లలకు చట్టంపై అవగాహన

విషయం తెలుసుకున్న కృష్ణారెడ్డి పిల్లలను పిలిపించి వృద్ధుల పోషణ, సంరక్షణకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలపై ఉంటుందని, ఆస్తిపై హక్కులు పొందిన అనంతరం వారిని నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదని వివరించారు. అనంత రం ఇరువర్గాలతో చర్చించి మనస్పర్థలను పరిష్కరించారు. వృద్ధ దంపతులకు ఆహారం, నివాసం, అనారోగ్య సమయంలో అవసరమైన సంరక్షణ అందించేలా పిల్లలతో అంగీకారం కుదిర్చి ఒప్పంద పత్రం రాయించారు.వృద్ధుల హక్కుల పరిరక్షణకు అండ వృద్ధుల హక్కులు, సంరక్షణకు ప్రభుత్వం కల్పించిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని కృష్ణారెడ్డి కోరారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి అధికారులు అండగా నిలవాలని సూచిం చారు. తెలంగాణవ్యాప్తంగా వృద్ధులు నిరాదరణకు గురైన సందర్భాల్లో సమాచార హక్కు వికాస సమితి అండగా ఉంటుందని తెలిపారు. వృద్ధులకు సహా యం, మార్గదర్శకత్వం అవసరమైనప్పుడు ప్రభుత్వం అందుబాటులో ఉంచిన 14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో సమితి నల్గొండ జిల్లా అధ్యక్షుడు బైరు సైదులుగౌడ్‌తదితరులు పాల్గొన్నారు.

## 150 గజాల్లో భారీ భవనం.. టౌన్ ప్లానింగ్ మౌనం!

- అక్రమ నిర్మాణాలపై చర్యలెక్కడ..? మరో అంజయ్యనగర్ తరహా ఘటన కోసం వేచి చూస్తున్నారా?

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**

రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌షాకోట్ డివిజన్ పరిధిలోని మాధవినగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా భారీ భవన నిర్మాణం కొనసాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు 150 గజాల స్థలంలో నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో భవనానికి అనుమతులు ఉన్నాయా, నిబంధనలకు అనుగుణంగా నిర్మిస్తున్నారా అన్న విషయాలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని వారు కోరుతున్నారు.

### అనుమతులు ఉన్నాయా..? నిబంధనలు పాటిస్తున్నారా?

నిర్మాణ అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, భవన ఎత్తు, నిర్మాణ నిబంధనలు, అగ్నిమాపక భద్రత ప్రమాణాలను పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే పనులు నిలిపివేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### అధికారుల మౌనం వెనుక కారణమేంటి?

నిర్మాణం కొనసాగుతున్నా అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణదారులకు పరోక్ష సహకారం ఉందా, అక్రమ నిర్మాణాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు అధికారులు ముడుపులు తీసుకుని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని వారు కోరుతున్నారు.



### ప్రమాదం జరిగే వరకు చర్యలు తీసుకోరా?

గతంలో నిబంధనల ఉల్లంఘనలతో నిర్మించిన భవనాల్లో అగ్ని ప్రమాదాలు, ఇతర ఘటనలు చోటుచేసుకున్న విషయాన్ని గుర్తుచేస్తున్న స్థానికులు.. మరో అంజయ్యనగర్ తరహా ఘటన జరిగిన తర్వాతే అధికారులు మేల్కొంటారా అని ప్రశ్నిస్తున్నారు. ప్రజల భద్రతకు ముప్పు కలిగించే అవకాశం ఉన్న నిర్మాణాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఉన్నతాధికారుల జోక్యానికి డిమాండ్

మాధవినగర్‌లో జరుగుతున్న నిర్మాణంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణ అనుమతులు, ప్లాన్ నిబంధనలు, సెట్‌బ్యాక్‌లు, భవన ఎత్తు, అగ్నిమాపక భద్రత తదితర అంశాలను పరిశీలించి ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల భవిష్యత్తులో ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు. అవినీతి ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుంచాలని కోరుతున్నారు.

## సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో దేవునిపల్లి పాఠశాలకు ప్రథమ స్థానం






- జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ.. సమకాలీన అంశాలపై సందేశాత్మక నాటికలు

**కామారెడ్డి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో జిల్లాస్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌ను దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎం. సిద్ధిరాం రెడ్డి మాట్లాడుతూ కృత్రిమ మేధ, సముద్రాల పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం–పరిశుభ్రత, నీటి సంరక్షణ, వాతావరణ మార్పులు, శాస్త్రీయ ఆవిష్కరణలు వంటి సమకాలీన అంశాలపై విద్యార్థులు సందేశాత్మక నాటికలను ప్రదర్శించినట్లు తెలిపారు. శాస్త్రీయ అంశాలను వినోదంతో మేళవించి ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా తమ ప్రతిభను చాటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని అన్నారు. పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దేవునిపల్లి ప్రథమ స్థానం సాధించగా, అక్షర హైస్కూల్, కామారెడ్డి ద్వితీయ స్థానం, జడ్పీహెచ్ఎస్ పాల్వంచ, జడ్పీహెచ్ఎస్ చుక్కాపూర్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలు, పాల్గొన్న విద్యార్థులను అధికారులు అభినందించి భవిష్యత్తులో మరిన్ని శాస్త్రీయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్, ఫిజికల్ సైన్స్ ఫోరం, బయోసైన్స్ ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాపరెడ్డి, సంతోష్, సురేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## “హామీలు ఎక్కడ? అభివృద్ధి ఎక్కడ?”

- 420 అడుగుల బ్యానర్‌తో భారీ నిరసన
- ప్రజల పక్షాన బీఆర్ఎస్.. ప్రభుత్వంపై పోరాటం ఆగదు: మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

**నాగారం, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలు, అమలు కాని హామీలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ రాంపల్లి చౌరస్తాలో బుధవారం ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని స్పష్టం చేశారు. ధర్నాలో 420 అడుగుల భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. కీసర మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు జలాల్‌పూరం సుధాకర్‌రెడ్డి, నాగారం డివిజన్ మాజీ అధ్యక్షుడు తెల్ల శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు కౌకుట్ల అనంత్‌రెడ్డి, మంగళపూరి వెంకటేష్, సీనియర్ నాయకులు గూడూరు ఆంజనేయులు గౌడ్, మాజీ వార్డు సభ్యులు సాయినాథ్‌గౌడ్, కొత్త భాస్కర్‌గౌడ్‌తో పాటు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



### ఘనంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

## కొండపల్లి గోపాలకృష్ణ పదవీ విరమణ

- ప్రజలకు అంకితభావంతో సేవలందించారు: అధికారులు, ప్రజాప్రతినిధులు



**నడిగూడెం, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్):**
రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలం అంకితభావంతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కొండపల్లి గోపాలకృష్ణకు వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి గోపాలకృష్ణ ఎల్లప్పుడూ ముందుండేవారని, నిరుపేదలకు రెవెన్యూ సేవలను చేరువ చేయడంలో ఆయన చూపిన చొరవ అభినందనీయమని అన్నారు. కోదాడ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతమ్మ సుధీర్ మాట్లాడుతూ రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా సేవలందించిన అధికారిగా గోపాలకృష్ణ గుర్తింపు పొందారని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ దున్న శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారంలో ఆయన అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్లు, వివిధ పార్టీల నాయకులు గోపాలకృష్ణతో తమకున్న అనుబంధాన్ని, కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం గోపాలకృష్ణ దంపతులను అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రముఖులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన

- వి.టి.సి.లో పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు.. సుమారు 100 మంది ఉద్యోగులు, సూపర్‌వైజర్లకు సూచనలు



**గోదావరిఖని, సెప్టెంబర్ 2 (నవజ్యోతి జిల్లా ప్రతినిధి):**
రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిఖని వి.టి.సి.లో సింగరేణి సూపర్‌వైజర్లు, ఉద్యోగులకు సైబర్ మోసాలు, రోడ్డు భద్రత, సోషల్ మీడియా వినియోగం, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింక్‌లను నమ్మవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా, ఏటీఎం, క్రెడిట్ కార్డు వివరాలు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ తప్పుడు, అభ్యంతరకర సమాచారాన్ని షేర్ చేయవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక జీవితాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. కార్యక్రమంలో వి.టి.సి. ఇన్‌చార్జి మాధవరెడ్డి, పోలీస్ సిబ్బంది, సింగరేణికి చెందిన సుమారు 100 మంది ఉద్యోగులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



## గౌరవ డాక్టరేట్ అందుకున్న అల్లాడి సత్యనారాయణ

**నడిగూడెం, సెప్టెంబర్ 02 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజరుద్దీన్) :**
నడిగూడెం మండలం కరివిరాల గ్రామానికి చెందిన అల్లాడి సత్యనారాయణకు సమాజసేవలో అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. హైదరాబాద్ బొగ్గులకుంటలోని తెలంగాణ సరస్వత భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకులు ఆకుల రమేష్, గూడూరు చెన్నారెడ్డి డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అల్లాడి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరింత అంకితభావంతో సమాజసేవ చేస్తానని తెలిపారు. ఆయనకు పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు కాసాని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బత్తిని గోపి, సీనియర్ నాయకులు సామినేని శ్రీనివాసరావు, పొలూరి శ్రీనివాసరెడ్డి, రణబోతు నర్సిరెడ్డి, ఎరగాని వెంకన్న, ఏడుకొండలు, అంబేద్కర్, పరుశరామ్, పీర్ సాహెబ్, పిచ్చయ్య తదితరులు అభినందనలు తెలిపారు.


## అభివృద్ధే లక్ష్యంగా ఎల్లంపేట మున్సిపాలిటీలో డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

### రూ.24.5 లక్షలతో అభివృద్ధి పనులు.. శంకుస్థాపన చేసిన చైర్‌పర్సన్ లావుడ్యా శ్రీదేవి



**మేడ్చల్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో సుమారు రూ.24.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ లావుడ్యా శ్రీదేవి బుధవారం శంకుస్థాపన చేశారు. 2వ వార్డు కాసింబాయ్ తండాలో రూ.7.5 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు, 7వ వార్డు రావల్‌కోల్ ప్రాంతంలో రూ.17 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ వార్డుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మేకల రజిత దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు కుమార్, శ్రీలత రమేష్, సురేష్‌రెడ్డి, భాస్కర్, శారద రాజునాయక్, అర్చన శ్రీనివాస్, ఏఈ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.32

## అంతర్గాంలో వైఎస్సార్ జయంతి వేడుకలు



**అంతర్గాం, సెప్టెంబర్ 2 (నవజ్యోతి జిల్లా ప్రతినిధి):**
పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన కోఆర్డినేటర్‌గా నియమితులైన అలకుంట రాజేశంకు అంతర్గాం చౌరస్తాలో ఘన సన్మానం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు యువ నాయకుడు దొబ్బల తరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రాజేశంను పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అలకుంట రాజేశం మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళల సంక్షేమానికి చేసిన సేవలను గుర్తుచేశారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. జేబీఎం సంస్థ ద్వారా విద్యార్థులు, బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని, యువతను భాగస్వామ్యం చేస్తూ జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రజాసేవా కార్యక్రమాలను మరింత చురుగ్గా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో దొబ్బల తరుణ్‌కుమార్, దుండుగుల రఘు, బానోత్ కార్తీక్, అలకుంట శ్రీనివాస్, అనిల్, వంశీ, వెంకటేష్, కుమార్, లక్ష్మణ్, రాకేష్, అజయ్, నవీన్, విజయ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పడకేసిన పల్లె..

# విషజ్వరాలతో చితుకుతున్న బతుకులు!

## అధికారుల నిర్లక్ష్యంపై కుక్కడం గ్రామస్తుల ఆగ్రహం

**మాడుగులపల్లి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
మండలంలోని కుక్కడం గ్రామంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయనే ఆందోళన గ్రామస్తుల్లో నెలకొంది. వారం రోజులుగా పలువురు జ్వరాలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు పేరుకుపోయి, మురుగునీరు నిల్వ ఉండటంతో దోమల బెడద పెరిగిందని ఆరోపిస్తున్నారు. పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారడంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?**

మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, నిల్వ నీటిని తొలగించడం, దోమల నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని కోరుతున్నారు. ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలతో పాటు పారిశుధ్య కార్యక్రమాలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. రోగాలు ముదిరిన తర్వాత స్పందిస్తారా..? విషజ్వరాలు ప్రబలిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని 6వ వార్డు సభ్యుడు ఆవుల వెంకన్న కోరారు. ఇప్పటికైనా అధికారులు కుక్కడం గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి మురుగు కాలువలను శుభ్రం చేయించి, నిల్వ నీటిని తొలగించి, దోమల నివారణ చర్యలను ముమ్మరం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.



## కాంగ్రెస్ గుండాగిరీకి ప్రజలే బుద్ధి చెబుతారు: మద్దూరి రాజు

### నాంపల్లి బీజేపీ కార్యాలయంపై దాడి రాజ్యాంగ విరుద్ధం

### హింసాత్మక రాజకీయాలకు భయపడేది లేదు



**పటాన్‌చెరు (గడ్డపోతారం) సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తల దాడి అత్యంత హేయమని గడ్డపోతారం మున్సిపాలిటీ బీజేపీ కన్వీనర్, అధ్యక్షుడు మద్దూరి రాజు మండిపడ్డారు. అధికార మదంతో ప్రతిపక్ష పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడటం కాంగ్రెస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ఈ దాడి ఒక పార్టీ కార్యాలయంపై జరిగిన ఘటన మాత్రమే కాదని, ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలపై దాడిగా అభివర్ణించారు. ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు అధికార పార్టీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడటం సరికాదన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బీజేపీ పోరాడుతుంటే సమాధానం చెప్పలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ఇటువంటి రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. భౌతిక దాడులు, బెదిరింపులతో బీజేపీ పోరాటాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను వెంటనే అరెస్ట్ చేసి, ఘటన వెనుక ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గడ్డపోతారం మున్సిపాలిటీ వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడతామని మద్దూరి రాజు హెచ్చరించారు.

## పెద్దపల్లి-గోదావరిఖని బస్సు పెంచికల్‌పేట్ మీదుగా నడపాలి

### ఆర్టీసీ అధికారులకు సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ వినతి

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి జిల్లా ప్రతినిధి):**
పెద్దపల్లి నుంచి గోదావరిఖని వెళ్లే టీజీఎస్‌ఆర్టీసీ బస్సును పెంచికల్‌పేట్ గ్రామం మీదుగా నడపాలని కోరుతూ సర్పంచ్ పల్లె మాధవి--నారాయణ ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామం నుంచి ప్రతిరోజూ పెద్దపల్లి, గోదావరిఖని ప్రాంతాలకు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. సరైన బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామ ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెద్దపల్లి--గోదావరిఖని బస్సును పెంచికల్‌పేట్ మీదుగా నడిపించాలని, త్వరగా సౌకర్యం కల్పించాలని సర్పంచ్ అధికారులను కోరారు.



## జూటా పాలనకు కేరాఫ్ రేవంత్ సర్కారు

### 22ఏ భూముల సమస్యపై అసెంబ్లీలో పోరాటం.. 420 హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం

### ఏడు రోజుల పోరుబాటను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా వాటి అమలులో విఫలమైందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా బీఆర్‌ఎస్ చేపట్టిన ఏడు రోజుల పోరుబాటను పటాన్‌చెరులో ఆయన ప్రారంభించారు. ఎంజీ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించి, ప్రజలకు కాంగ్రెస్ హామీలను గుర్తుచేస్తూ 'బాకీ హామీల కార్డులు' పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ భూములపై పోరాటం వివాదాలు లేని భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు తమ ఆస్తులను విక్రయించలేని, కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడుతోందని మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ సమస్యను అసెంబ్లీలో ప్రధానంగా లేవనెత్తి, బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. సంక్షేమ పథకాలు నిర్వీర్యం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అమలైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆయన ఆరోపించారు. పేదలు, మహిళలు, విద్యార్థులు, రైతులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని విమర్శించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వార్డు, డివిజన్‌లో పోరుబాట కార్యక్రమాలను విస్తృతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగిస్తుందని, అవసరమైతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.39

## పేదల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్

### నాగారంలో కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళులు.. వృద్ధులకు పండ్ల పంపిణీ

**నాగారం, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నాగారం డివిజన్ కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## యువతకు పదవులు దక్కడం అభినందనీయం: శ్రీరామ్ వెంకటేశ్

**రామేశ్వర్‌పల్లి సొసైటీ డైరెక్టర్, వార్డు మెంబర్‌గా ఎన్నికైన యువ నాయకులకు సన్మానం**

**బిక్కనూరు, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
యువతకు సరైన ప్రోత్సాహం అందిస్తే గ్రామాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. రామేశ్వర్‌పల్లి సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ నాయకుడు సామ రాకేష్, వార్డు మెంబర్‌గా విజయం సాధించిన వల్లెపు శశిలను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ వెంకటేశ్ మాట్లాడుతూ ప్రజాసేవలో చురుగ్గా పనిచేస్తున్న యువతకు ప్రజాప్రతినిధులుగా అవకాశం లభించడం సంతోషకరమన్నారు. యువ కార్యకర్తలకు ఇది గొప్ప ప్రోత్సాహమని, నూతన ప్రజాప్రతినిధులు యువశక్తితో రామేశ్వర్‌పల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## 283 మంది బూత్ స్థాయి ఏజెంట్లకు సర్ ఫేజ్--2పై ప్రత్యేక శిక్షణ



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల పునఃసమీక్షలో భాగంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 283 మంది బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ముఖ్యఅతిథిగా హాజరై ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. గాంధీభవన్ మాస్టర్ శిక్షకుడు, సర్ సమన్వయకర్త మాణిక్యం మల్లేష్ యాదవ్, ఎల్లారెడ్డి నియోజకవర్గ సర్ సమన్వయకర్త నందిమాల యాదయ్య ఓటరు జాబితా పరిశీలన, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణలు, బూత్ స్థాయి బాధ్యతలపై సమగ్ర శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, ఇతర మండల అధ్యక్షులు, బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కారానికి చర్యలు

**గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమంలో ఆయన పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను నేరుగా విన్నారు. వ్యక్తిగత, సామాజిక, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులు, శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, కార్మికులు, వృద్ధులు, మైనారిటీలు, బలహీన వర్గాల సమస్యలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యలను పరిష్కరించడం తమ బాధ్యత అని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని మహమ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు.

## 420 అడుగుల బ్యానర్‌తో కాంగ్రెస్‌పై గులాబీ గర్జన

**వెయ్యి రోజుల పాలనపై కుత్బుల్లాపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ భారీ ధర్నా**

**హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదు: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**






**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ చౌరస్తాలో భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో 420 హామీలకు ప్రతీకగా 420 అడుగుల భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. గులాబీ జెండాలు, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో చౌరస్తా మార్మోగింది. ఈ సందర్భంగా కేపీ వివేకానంద్ మాట్లాడుతూ 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన హామీలు వెయ్యి రోజులు గడిచినా ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా, మహిళలు, యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలతో అంతరాయం కలగకుండా చూడాలి

**వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో విద్యుత్ శాఖకు బీజేపీ కౌన్సిలర్ల వినతి**

**కామారెడ్డి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
రాబోయే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా విద్యుత్ తీగల వల్ల మండపాల నిర్మాణం, శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని బీజేపీ కౌన్సిలర్ల బృందం కోరింది. ఈ మేరకు కామారెడ్డి డివిజన్ విద్యుత్ కార్యాలయంలో డివిజన్ ఇంజినీర్ నందకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పురవీధులు, గల్లీల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగల కారణంగా మండపాల ఏర్పాటుకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చోట విద్యుత్ స్తంభాల ఎత్తు పెంచాలని కోరారు. శోభాయాత్ర సందర్భంగా విద్యుత్ తీగలు తగలకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినాయక మండపాల నిర్వాహకులు కూడా పోలీసు, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులకు సహకరించి ఉత్సవాలను వైభవంగా, సురక్షితంగా నిర్వహించాలని బీజేపీ కౌన్సిలర్లు కోరారు.



## ఎల్లంపల్లిలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అంతర్గాం, ఆగస్టు 31 (నవజ్యోతి జిల్లా ప్రతినిధి):**
పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లి గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆరుముళ్ల మాధవి మల్లేష్ ముఖ్యఅతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా అందించడంతో పాటు డిజిటల్ సేవలను సులభతరం చేయడమే స్మార్ట్ రేషన్ కార్డుల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎల్లంపల్లి రెవెన్యూ అధికారి సుమలత, గ్రామ కార్యదర్శి సాగర్, రేషన్ డీలర్ శారద, ఉపసర్పంచ్ గుమ్ముల శ్రీకాంత్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**రైతుల సంక్షేమానికి ఆయన సేవలు చిరస్మరణీయం: డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్**

**జుక్కల్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన పలు కార్యక్రమాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చికోటి మనోజ్‌కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రజా పండరి, సర్పంచులు బొజ్జ అంజయ్య, కేతావత్ నారాయణ, నాయకులు చిరంజీవి, రామగౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి



**బిక్కనూరు, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా బుధవారం బిక్కనూరు మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన గొప్ప జననేత వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. వైఎస్సార్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, తిప్పాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ భీమ్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి, ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, జిల్లా కార్యదర్శి రాజబాబు, నాయకుడు మైపాల్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు: చైర్మన్ ఇంద్రకరణ్‌రెడ్డి

**భిక్కనూరు, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామ సొసైటీ పాలకవర్గ సాధారణ సమావేశం బుధవారం చైర్మన్ బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, రుణాలను సకాలంలో అందించడంతో పాటు పలు అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించి తీర్మానాలు చేశారు. రైతులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతు సొసైటీలో సభ్యత్వం తీసుకుని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమానికి పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ పాలకవర్గ సభ్యులు, డైరెక్టర్లు, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్ఎస్ 'బాకీ కార్డు' నిరసన

**వెయ్యి రోజులు గడిచినా హామీల అమలు కాలేదంటూ మెదక్‌లో భారీ ప్రదర్శన**



**మెదక్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. హామీల అమలులో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో బుధవారం భారీ నిరసన నిర్వహించారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు 420 అడుగుల ఫ్లెక్సీతో ప్రదర్శన నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ హామీలు, వాటి అమలుపై రూపొందించిన 'బాకీ కార్డులను' ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.2,500, పింఛన్లను రూ.4 వేలకు పెంచడం, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రైతుబంధు, రైతుబీమా సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని, రుణమాఫీ సక్రమంగా జరగలేదని విమర్శించారు. కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, గంగా నరేందర్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్, దీపక్, కుమార్, సోహెల్, పలు మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈరోజు గణేష్ ఉత్సవాలపై సన్నాహక సమావేశం



**బిక్కనూరు, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలంలో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. బిక్కనూరులోని పద్మశాలి సంఘం భవన్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు అనుమతులు, ఊరేగింపులు, ట్రాఫిక్, విద్యుత్ భద్రత, సౌండ్ సిస్టమ్, నిమజ్జనం, శాంతిభద్రతలపై సూచనలు, మార్గదర్శకాలు ఇవ్వనున్నారు. మండలంలోని అన్ని గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు సమావేశానికి హాజరుకావాలని ఎస్ఐ అనిల్ కుమార్ కోరారు.



## ఘనంగా వైఎస్సార్ వర్ధంతి వేడుకలు

### ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌కు నిజమైన నివాళి : కాంగ్రెస్ నాయకులు

**కామారెడ్డి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు వైఎస్సార్ ప్రజా సంక్షేమ పాలనను స్మరించుకున్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేపట్టిన పలు కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని పేర్కొన్నారు. రైతుల కోసం ఉచిత విద్యుత్, జలయజ్ఞం, పేదలకు మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాలను ఆయన అమలు చేశారని గుర్తుచేశారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, కామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజాగౌడ్, కౌన్సిలర్లు అంజద్, అన్వర్ అహ్మద్, లడ్డు, కన్నయ్య, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మత్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుట్నాల శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు భూమని బాల్రాజ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గంప ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పడిహార్ కిరణ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు సిరాజుద్దీన్, రామ్‌కుమార్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి భరత్, టింకు, జమీల్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గులాబీ గర్జన.. కాంగ్రెస్ 420 హామీలపై

## బీఆర్ఎస్ సమరభేరి

### గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో 420 అడుగుల బ్యానర్ ప్రదర్శన.. 'బాకీ కార్డుల'తో వినూత్న నిరసన





**కామారెడ్డి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కామారెడ్డిలో భారీ నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలకు ప్రతీకగా 420 అడుగుల భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. బీఆర్ఎస్ జెండాలు, కార్యకర్తల నినాదాలతో నిరసన ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా అనేక హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలతో పాటు రైతులు, మహిళలు, యువత, యువకులు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఇంకా అమలు చేయాల్సిన వాటిని 'బాకీ'గా గుర్తు చేసేందుకే బీఆర్ఎస్ 'బాకీ కార్డులు' పంపిణీ చేస్తోందని గంప గోవర్ధన్ తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలను నిలబెట్టుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని, ప్రజలకు ఇచ్చిన మాటలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 22/ఏ నిషేధిత భూములపై బీజేపీ ధర్నా

### రైతులకు అండగా ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్

**నర్సాపూర్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
22/ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. రైతులు, బీజేపీ శ్రేణులు చేపట్టిన ఈ ఆందోళనకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ 22/ఏ నిషేధిత భూముల కారణంగా రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల కష్టాలు తీర్చడమే తమ లక్ష్యమని, 22/ఏ భూములకు శాశ్వత పరిష్కారం లభించే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ధర్నాలో రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ఎంపీల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్ యాదవ్, జిల్లా ఇన్‌చార్జి నర్సింహారెడ్డి, పంజా విజయ్‌కుమార్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మల్లిక, నాయకులు సురేష్, జనార్దన్, కందనూరి శ్రీనివాస్ గౌడ్, అంగడిపేట శ్రీనివాస్ గౌడ్, దుర్గప్ప, ఆంజనేయులు గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మెదక్ జిల్లా యూసీపీఏ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**తూప్రాన్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి నవీన్):**
మెదక్ జిల్లాకు యూనివర్సల్ చర్చి పాస్టర్ల అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో యూసీపీఏ చైర్మన్ సంజీవరావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జోసెఫ్ పాల్ (మెదక్), ఉపాధ్యక్షుడిగా రాజ్‌కుమార్ (తూప్రాన్), ప్రధాన కార్యదర్శిగా థియోడర్ (పెద్ద శంకరంపేట), సంయుక్త కార్యదర్శిగా సొలొమోను రాజు (చిన్న శంకరంపేట), కోశాధికారిగా లక్ష్మణ్ పాల్ (నర్సాపూర్) ఎన్నికయ్యారు. సలహా కమిటీ సభ్యులుగా స్వామిదాస్, పాల్ సుధాకర్, రెవ. సత్యానందం, రెవ. జెకర్యా, రెవ. జ్ఞానరాజ్, కరుణాకర్, సుధాకర్, ఫ్రాన్సిస్ జగన్, కాంతారావులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో మెదక్ నియోజకవర్గ అధ్యక్షుడు డేవిడ్ రాజు, నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుదాస్, కమిటీ సభ్యులు, మండల కమిటీల అధ్యక్షులు, సభ్యులు, సీఐఎస్ఐ చర్చి పాస్టర్లు, జిల్లా పాస్టర్లు యోహాను, దేవదాస్, ఎలీషా, సామెల్ బెనహర్, జోయేల్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం

**రామాయంపేట, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):**
మండలంలోని కాట్రియాల్ గ్రామానికి చెందిన కుమ్మరి చిన్నలింగం (60) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయంగా రూ.5 వేల నగదును అందజేశారు. కష్టకాలంలో పేద కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతని, భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని నాయకులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైలారం శ్యామ్, బిల్లం సాయిరెడ్డి, తిరుపల్లి శ్రీశైలంరెడ్డి, కమ్మరి సత్యపాల్, మద్ది ప్రభాకర్, కిషన్, సంతోష్, కంది మల్లారెడ్డి, కుమ్మరి రాములు, బాబు తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహ ఏర్పాట్ల పనులను పరిశీలించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు



**రామాయంపేట, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):**
రామాయంపేట పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు చేపడుతున్న పనులను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మెదక్ జిల్లా అధ్యక్షుడు గుండా ఎల్లం తదితరులు బుధవారం పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న సుందరీకరణ పనులపై కూడా చర్చించారు. పట్టణ అభివృద్ధి, సుందరీకరణకు నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, మున్సిపల్ పాలకవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ ఉద్యమకారుడు గద్దర్, వెంకటస్వామి తదితర మహనీయుల విగ్రహాలను కూడా ఏర్పాటు చేయాలని గుండా ఎల్లం కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మాసాయిపేట మల్లేశం, కాంగ్రెస్ నాయకులు బైరం శంకర్, బైరం శీను, గంగారం, భూమకిషన్, కొక్కు బాబు, సత్యం, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఖర్జూర సాగులో ఆధునిక పద్ధతుల పరిశీలన

రామాయంపేట, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): రామాయంపేట మండలం దామరచెరువు గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు ఏ.వి. సత్యనారాయణ ఖర్జూర తోటను ఇజ్రాయిల్ ఎంబసీ ప్రతినిధి ఉరి రూబిన్‌స్టెయిన్ బుధవారం సందర్శించారు. తోటలో రైతు అనుసరిస్తున్న ఆధునిక సాగు పద్ధతులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఖర్జూర సాగులో బిందు సేద్యం, అంతర పంటగా డ్రాగన్ ఫ్రూట్ సాగు, పంటల నిర్వహణ, తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే విధానాలపై సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. అభ్యుదయ రైతులు అవలంబిస్తున్న వినూత్న సాగు పద్ధతులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ఇతర ప్రాంతాల్లోనూ వాటిని ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు ఉరి రూబిన్‌స్టెయిన్ తెలిపారు. రైతుల అనుభవాలు, సాంకేతిక పద్ధతులు అంతర్జాతీయ స్థాయిలో ఉపయోగపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ సంయుక్త సంచాలకురాలు రామలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్, జిల్లా ఉద్యాన అధికారి ప్రతాప్‌సింగ్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్, ఉద్యాన అధికారి రచన, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.



## పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వైఎస్సార్



**వెల్దుర్తి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి ముకుంద్):**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వెల్దుర్తి మండలంలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు హనుమన్నగారి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల పెన్నిధిగా, రైతు బాంధవుడిగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆయన హయాంలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104 సేవలు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, పావలా వడ్డీ వంటి పథకాలు పేదలు, రైతులు, విద్యార్థులకు ఎంతో మేలు చేశాయని గుర్తుచేశారు. వైఎస్సార్ ఒక వ్యక్తి కాదని, ఒక శకమని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్ కిష్టగౌడ్, సీనియర్ నాయకులు శేఖగౌడ్, శేరిలా సర్పంచ్ బంజ లావణ్యరవి, ఎలుకపల్లి సర్పంచ్ పావనిశంకర్, వార్డు సభ్యుడు మహేందర్‌గౌడ్, ముక్తాబాయ్, గజం ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు, వైఎస్సార్ అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

## తెల్లకోటు ముసుగులో ప్రాణాల వ్యాపారం..!

- టెన్త్, ఇంటర్, బీకామ్ చదివి క్లినిక్‌లలో వైద్యం..
- సైబరాబాద్‌లో 10 క్లినిక్‌లపై ఏకకాలంలో దాడులు.. 10 మంది నకిలీ వైద్యుల అరెస్ట్






**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
టెన్త్, ఇంటర్, బీకామ్ చదివి ఎలాంటి వైద్య అర్హతలు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తూ రోగులకు చికిత్స అందిస్తున్న 10 మంది నకిలీ వైద్యులను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. కుత్బుల్లాపూర్ ఎస్‌వోటీ, ఆర్‌సీపురం ఎస్‌వోటీ బృందాలు వైద్యశాఖ అధికారులతో కలిసి మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఏకకాలంలో 10 క్లినిక్‌లపై దాడులు నిర్వహించాయి. కేసు వివరాలను పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు.

**చిన్నారులకు సైతం చికిత్స**

పేట్‌బషీరాబాద్, మేడ్చల్, జగద్గిరిగుట్ట, సూరారం, పటాన్‌చెరు, ఆర్‌సీపురం తదితర ప్రాంతాల్లో నకిలీ క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సరైన వైద్య అర్హతలు లేకుండానే బెడ్లు ఏర్పాటు చేసి రోగులకు చికిత్స అందిస్తున్నారని తెలిపారు. చిన్నారులకు సైతం వైద్యం అందించినట్లు గుర్తించామని డీసీపీ తెలిపారు. ఎలాంటి వైద్య పరిజ్ఞానం లేకుండా సెలైన్లు, ఐవీ ద్రవాలు ఎక్కించడం, మందులు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని వెల్లడించారు.

**ఎక్స్‌పైరీ మందులు, వైద్య సామగ్రి స్వాధీనం**

దాడుల్లో బీపీ యంత్రాలు, స్టెతస్కోప్‌లు, గ్లూకోజ్ పరీక్ష పరికరాలు, సిరంజీలు, ఇతర వైద్య సామగ్రితో పాటు గడువు ముగిసిన మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ వైద్యుల వద్ద చికిత్స పొందడం ప్రాణాలకు ప్రమాదకరమని డీసీపీ హెచ్చరించారు. ప్రజలు గుర్తింపు పొందిన వైద్య అర్హతలు కలిగిన వైద్యుల వద్ద మాత్రమే చికిత్స పొందాలని సూచించారు. నకిలీ వైద్యులు లేదా అనుమానాస్పద క్లినిక్‌ల సమాచారం ఉంటే పోలీసులకు లేదా వైద్యశాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీలు టి. గోవర్ధన్, ఎ. విశ్వప్రసాద్, ఏసీపీ శంకర్‌రెడ్డి, ఎస్‌వోటీ ఆర్‌సీపురం ఇన్‌స్పెక్టర్ పి. సతీష్, కుత్బుల్లాపూర్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ కె. నరసింహ, సంబంధిత ఎస్‌హెచ్‌వోలు, ఎస్‌వోటీ అధికారులు పాల్గొన్నారు.

# ఒకే వార్త.. రెండు ప్రపంచాలు!

## రైట్-లెఫ్ట్ మీడియా మధ్య నడుస్తున్న నేరేటివ్ యుద్ధం.. యుద్ధభూమి నుంచి ఎన్నికల వరకు ప్రభావం

ఒకే సంఘటన.. ఒకే సమయం.. ఒకే వాస్తవం. కానీ రెండు మీడియా సంస్థల్లో రెండు భిన్నమైన కథనాలు. ఒకరికి అది జాతీయ భద్రత కోసం తీసుకున్న అవసరమైన నిర్ణయం.. మరొకరికి ప్రజాస్వామ్యానికి ముప్పు. ఒకరు సరిహద్దు భద్రతను ముందుకు తెస్తే.. ఇంకొకరు మానవ హక్కులను ప్రధానంగా చూపిస్తారు. వాస్తవం ఒక్కటే అయినా.. దాన్ని చూపించే ఫ్రేమ్ మారితే ప్రజలకు కనిపించే చిత్రం మారుతుంది.




ఇదే ఇప్పుడు ప్రపంచ రాజకీయాలు, మీడియా రంగంలో పెరుగుతున్న 'నేరేటివ్ యుద్ధం'. వార్తలో ఏ అంశాన్ని ముందుకు తేవాలి? ఏ విషయాన్ని పక్కన పెట్టాలి? ఎవరిని నిపుణుడిగా చూపాలి? ఏ పదాన్ని ఉపయోగించాలి? ఏ దృశ్యాన్ని పదేపదే ప్రసారం చేయాలి? ఇవన్నీ సంపాదకీయ నిర్ణయాలే. కానీ వాటి ప్రభావం కేవలం వార్తకే పరిమితం కాదు. ప్రజలు ఒక సంఘటనను ఎలా అర్థం చేసుకోవాలి? దానిపై ఎవరి వైపు నిలవాలి? అనే దానిపైనా ప్రభావం చూపవచ్చు. అందుకే ఆధునిక రాజకీయాల్లో పోరాటం కేవలం పార్లమెంట్లలో, ఎన్నికల సభల్లోనే జరగడం లేదు. సమాచార వేదికలపైనా జరుగుతోంది.

### మీడియాకు నిధులు.. రాజకీయ ప్రభావానికి మార్గమా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం యూరప్‌లో కన్జర్వేటివ్ భావజాలానికి సంబంధించిన సివిల్ సొసైటీ కార్యక్రమాలకు కనీసం 25 మిలియన్ డాలర్ల నిధుల ప్యాకేజీని ప్రతిపాదించింది. ఇందులో సుమారు 4 మిలియన్ డాలర్లను రైట్‌వింగ్ మీడియా, జర్నలిజం కార్యక్రమాలకు కేటాయించే ప్రతిపాదన ఉన్నట్లు రాయిటర్స్ నివేదించింది. వలసలు, మీడియా స్వేచ్ఛ, జాతీయ సార్వభౌమత్వం, మత స్వేచ్ఛ, యూరోపియన్ విధానాలపై పరిశోధన, డాక్యుమెంటేషన్, జర్నలిజం కార్యక్రమాలకు ఈ నిధులను ఉపయోగించాలన్నది ప్రతిపాదనగా ఉంది. అయితే ఏ సంస్థలకు నిధులు ఇవ్వాలన్నది తుది నిర్ణయానికి రాలేదు. అమెరికా ప్రభుత్వం దీన్ని భావవ్యక్తీకరణ, ప్రజాస్వామ్యం, పౌర సమాజానికి మద్దతుగా వివరిస్తుండగా.. యూరప్‌లోని విమర్శకులు మాత్రం విదేశీ ప్రభుత్వం తమ దేశాల రాజకీయ చర్చల్లో ప్రభావం చూపే ప్రయత్నంగా అభివర్ణిస్తున్నారు. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. ఒక ప్రభుత్వం తనకు అనుకూలమైన విలువలు, విధానాలను ప్రోత్సహించే మీడియా లేదా సంస్థలకు నిధులు ఇస్తే.. అది ప్రజాస్వామ్యానికి మద్దతా? లేక రాజకీయ ప్రభావాన్ని విస్తరించే వ్యూహమా? దీనికి సమాధానం నిధులు ఇవ్వడమే మంచిదా.. చెడ్డదా అనే సులభమైన విభజనలో లేదు. నిధుల ఉద్దేశం ఏమిటి? అవి ఎంత పారదర్శకంగా అందుతున్నాయి? నిధులు పొందిన సంస్థల సంపాదకీయ స్వాతంత్ర్యం ఎంతవరకు కాపాడబడుతోంది? అన్నదే అసలు ప్రశ్న. ఎందుకంటే సమాచారంపై ప్రభావం చూపగల శక్తి.. చివరికి రాజకీయ నిర్ణయాలపై కూడా ప్రభావం చూపగలదు.

### రైట్.. లెఫ్ట్.. అసలు తేడా ఎక్కడుంది?

సాధారణంగా రైట్‌వింగ్ లేదా కన్జర్వేటివ్ మీడియా జాతీయవాదం, సార్వభౌమత్వం, సరిహద్దు భద్రత, వలసల నియంత్రణ, సంప్రదాయ విలువలు వంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. లెఫ్ట్‌వింగ్ లేదా లిబరల్ మీడియా సామాజిక న్యాయం, ఆర్థిక అసమానత, మైనారిటీ హక్కులు, కార్మిక హక్కులు, పర్యావరణం, ప్రభుత్వ జవాబుదారీతనం, సంస్థల స్వతంత్రత వంటి అంశాలను ముందుకు తెస్తుంది. అయితే రైట్ అంటే అబద్ధం.. లెఫ్ట్ అంటే నిజం అనే సూత్రం లేదు. అలాగే దానికి విరుద్ధమైన సూత్రం కూడా నిజం కాదు. అసలు తేడా చాలాసార్లు వాస్తవాలను ఎంచుకోవడంలో, వాటికి ఇచ్చే ప్రాధాన్యంలో, ఉపయోగించే పదజాలంలో, సందర్భాన్ని వివరించే విధానంలో కనిపిస్తుంది. ఒక సంఘటనలో పది వాస్తవాలు ఉన్నాయనుకుందాం. అందులో ఏ మూడు వాస్తవాలను హెడ్‌లైన్‌గా ఎంచుకున్నామన్నదే చాలాసార్లు ప్రజలకు కనిపించే కథనాన్ని నిర్ణయిస్తుంది. **అదే మీడియా ఫ్రేమింగ్.**

### ఆపరేషన్ సిందూర్.. యుద్ధభూమికి అవతల మరో పోరాటం

2025లో భారత్--పాకిస్థాన్ మధ్య జరిగిన ఆపరేషన్ సిందూర్ ఈ నేరేటివ్ యుద్ధానికి మరో ఉదాహరణగా నిలిచింది. సరిహద్దుల్లో సైనిక చర్యలు కొనసాగుతుండగానే సోషల్ మీడియా, అంతర్జాతీయ మీడియా, దౌత్య వర్గాల్లో మరో పోరాటం మొదలైంది. ఎవరి విమానాలు కూలాయి? ఎవరి క్షిపణులు పనిచేశాయి? ఎవరి రక్షణ వ్యవస్థ మెరుగ్గా ఉంది? అనే ప్రశ్నలతో పాటు.. ఎవరి కథనాన్ని ప్రపంచం నమ్ముతోంది? అన్న ప్రశ్న కూడా కీలకంగా మారింది. రూసీ విశ్లేషణ ప్రకారం, ఘర్షణ ప్రారంభ దశలో ఏర్పడిన సమాచార ఖాళీలో పాకిస్థాన్ వైపు నుంచి వచ్చిన వాదనలు వేగంగా వ్యాపించాయి. అనంతరం ఈ ఘర్షణను భారత్--పాకిస్థాన్ పోరాటంగా మాత్రమే కాకుండా చైనా జీ-10--ఫ్రెంచ్ రఫేల్ మధ్య సాంకేతిక పోటీగా ఫ్రేమ్ చేసే ప్రయత్నాలు కూడా కనిపించాయి. ఇక్కడ యుద్ధం, దౌత్యం, మీడియా, రక్షణ మార్కెట్ ప్రయోజనాలు ఒకదానితో ఒకటి కలిసిపోతాయి. యుద్ధంలో జరిగిన ప్రతి సంఘటనకు సైనిక ప్రాధాన్యం ఉండొచ్చు. కానీ దాని చుట్టూ నిర్మించబడే కథనానికి ఆర్థిక, దౌత్య, వ్యూహాత్మక విలువ కూడా ఉండొచ్చు. ఒక దేశం తన సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి నిరూపించుకోవాలనుకోవచ్చు. మరో దేశం తన ఆయుధ వ్యవస్థకు అంతర్జాతీయ మార్కెట్‌ను పెంచుకోవాలనుకోవచ్చు. ఇంకొక దేశం ప్రత్యర్థి ఆయుధ వ్యవస్థపై అనుమానాలు పెంచాలని చూడవచ్చు. అందుకే ఆధునిక యుద్ధంలో బుల్లెట్లతో పాటు కథనాలు కూడా వ్యూహాత్మక సాధనాలుగా మారుతున్నాయి.

### రఫేల్--జీ-10.. యుద్ధ నేరేటివ్‌కు మార్కెట్ విలువ

ఒక ఆయుధ వ్యవస్థ యుద్ధంలో సమర్థంగా పనిచేసిందన్న అంతర్జాతీయ అభిప్రాయం ఏర్పడితే దాని మార్కెట్ విలువ పెరగవచ్చు. విఫలమైందన్న భావన ఏర్పడితే భవిష్యత్ కొనుగోలుదారుల ఆసక్తిపై ప్రభావం పడవచ్చు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రఫేల్, చైనా జీ-10,గ్రా-15 క్షిపణుల సామర్థ్యంపై ప్రపంచవ్యాప్తంగా జరిగిన చర్చ అందుకే ప్రాధాన్యం సంతరించుకుంది. అసోసియేటెడ్ ప్రెస్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఫ్రెంచ్ అధికారులు చైనా దౌత్య వ్యవస్థలోని డిఫెన్స్ అటాషేలు కొన్ని దేశాల రక్షణ అధికారుల వద్ద రఫేల్ పనితీరుపై సందేహాలు కలిగించే వాదనలు ప్రస్తావించి, చైనా తయారీ ప్రత్యామ్నాయాలపై ఆసక్తి పెంచే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. అయితే దీనిని ఆధారంగా చేసుకుని సోషల్ మీడియాలో కనిపించే ప్రతి రఫేల్ వ్యతిరేక ప్రచారం వెనుక చైనా ప్రభుత్వమే ఉందని చెప్పడం సరికాదు. ఆన్‌లైన్‌లోని ప్రతి ఖాతాను ప్రభుత్వంతో నేరుగా అనుసంధానించలేమని ఫ్రెంచ్ అధికారులు కూడా స్పష్టం చేశారు. అయినా ఈ పరిణామం ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది. ఆధునిక యుద్ధంలో ఆయుధం ఎంత ముఖ్యమో.. ఆ ఆయుధం గురించి ప్రపంచం ఏమనుకుంటుందన్నది కూడా అంతే ముఖ్యం. యుద్ధం ముగిసిన తర్వాత కూడా నేరేటివ్ కొనసాగుతుంది. వైరల్ వీడియోలు, నిపుణుల విశ్లేషణలు, మీడియా కథనాలు, సోషల్ మీడియా పోస్టులు, దౌత్య ప్రకటనలు కలిసి ఒక ఆయుధ వ్యవస్థపై ప్రపంచ అభిప్రాయాన్ని నిర్మించగలవు. ఆ అభిప్రాయం భవిష్యత్ రక్షణ కొనుగోళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. సమాచారం ఇప్పుడు కేవలం వార్తా వస్తువు కాదు.. వ్యూహాత్మక ఆస్తి కూడా.

### చైనా మాత్రమే కాదు.. నేరేటివ్ యుద్ధం ప్రపంచవ్యాప్తం

ఇలాంటి సమాచార ప్రభావాన్ని ఏ ఒక్క దేశానికో పరిమితం చేయడం సరికాదు. అమెరికా, చైనా, రష్యా, యూరప్, మధ్యప్రాచ్య దేశాలు.. ప్రతి దేశానికీ తమ భద్రత, విదేశాంగ, వాణిజ్య ప్రయోజనాలు ఉన్నాయి. ప్రభుత్వాలు, దౌత్య వ్యవస్థలు, థింక్‌ట్యాంకులు, మీడియా కార్యక్రమాలు, సోషల్ మీడియా, ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా తమకు అనుకూలమైన సమాచార వాతావరణాన్ని నిర్మించేందుకు ప్రయత్నించవచ్చు. అందుకే సమాచారాన్ని ఎవరు చెప్పారు? అన్నది ఎంత ముఖ్యమో.. ఏ ఆధారంతో చెప్పారు? అన్నది అంతకంటే ముఖ్యం. ఒక దేశానికి వ్యతిరేకంగా వచ్చిన ప్రతి వార్తను శత్రు దేశం ప్రచారంగా కొట్టిపారేయడం ఎంత తప్పో.. ఒక దేశానికి అనుకూలంగా వచ్చిన ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మడం కూడా అంతే ప్రమాదకరం.

### భారత్‌లోనూ మీడియా రాజకీయ రంగుల్లోకి

భారతదేశంలో మీడియా రాజకీయ విభజనపై చర్చ కొత్తది కాదు. ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు ఎదుర్కొనే సంస్థలను ఒక వర్గం 'గోదీ మీడియా'గా పిలుస్తోంది. ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ప్రశ్నించే సంస్థలను మరో వర్గం 'లెఫ్ట్ లిబరల్ మీడియా'గా అభివర్ణిస్తోంది. ఈ ముద్రలు ఇప్పుడు సోషల్ మీడియాలో రాజకీయ ఆయుధాలుగా మారాయి. వార్తలోని ఆధారం ఏమిటన్నదికంటే.. ఆ వార్త చెప్పిన సంస్థ ఎవరి వైపు ఉంది? అన్నదే ముందుకు వస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన పరిణామం. ఒక వార్తను దాని ఆధారాలతో కాకుండా మీడియా సంస్థ రాజకీయ రంగును బట్టి అంగీకరించడం లేదా తిరస్కరించడం మొదలైతే.. ప్రజా చర్చ వాస్తవాల నుంచి భావజాల పోరాటంగా మారుతుంది. ఒక సంస్థ గతంలో తప్పు చేసిందని.. ఆ సంస్థ ఇప్పుడు ప్రచురించే ప్రతి వార్త కూడా తప్పేనని నిర్ణయించడం ఎంత తప్పో.. మరో సంస్థ గతంలో ప్రభుత్వాన్ని విమర్శించిందని దాని ప్రతి కథనం నిజమేనని భావించడం కూడా అంతే తప్పు.

### యాజమాన్యం నుంచి అల్గారిథమ్ వరకు

మీడియా స్వాతంత్ర్యాన్ని అర్థం చేసుకోవాలంటే యాజమాన్యం, పెట్టుబడులు, ప్రకటనల ఆదాయం, ప్రభుత్వ ప్రకటనలపై ఆధారపడటం, సబ్‌స్క్రిప్షన్లు, కార్పొరేట్ ప్రయోజనాలు వంటి అంశాలను పరిశీలించాల్సిందే. అయితే యాజమాన్యమే ప్రతి సంపాదకీయ నిర్ణయాన్ని నిర్ణయిస్తుందని చెప్పడం కూడా సరైంది కాదు. సంపాదకుల స్వాతంత్ర్యం, జర్నలిస్టుల వృత్తి ప్రమాణాలు, సంస్థ విధానం, వ్యాపార నమూనా, పాఠకుల విశ్వాసం కూడా కీలక పాత్ర పోషిస్తాయి. సోషల్ మీడియా రావడంతో సమాచార గేటుకీపర్ కూడా మారిపోయాడు. టీవీ, పత్రికలతో పాటు యూట్యూబర్లు, పాడ్‌కాస్టర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, డిజిటల్ జర్నలిస్టులు కోట్ల మందిని నేరుగా చేరుకోగలుగుతున్నారు. అదే సమయంలో అల్గారిథమ్‌లు మనకు నచ్చిన కంటెంట్‌ను మరింత చూపించడం వల్ల ఒకే రకమైన అభిప్రాయాల మధ్యనే మనం చిక్కుకునే ప్రమాదం ఉంది. దీనినే ఎకో చాంబర్ ప్రభావం అంటారు. ప్రత్యామ్నాయ వాదనలు కనిపించకపోతే.. మనకు కనిపిస్తున్న సమాచారమే మొత్తం వాస్తవమని భావించే పరిస్థితి ఏర్పడుతుంది.

### ఎన్నికల్లో అసలు ఆయుధం.. అజెండా

ఎన్నికల సమయంలో ఈ ప్రభావం మరింత పెరుగుతుంది. నిరుద్యోగం, ధరలు, జాతీయ భద్రత, మతం, కులం, అవినీతి, రైతుల సమస్యలు, మహిళల భద్రత.. ఎన్నో అంశాలు ఉన్నప్పటికీ ఏ అంశం రోజంతా చర్చకు వస్తుందో అది ప్రజల దృష్టిలో మరింత ముఖ్యమైనదిగా మారవచ్చు. అయితే మీడియానే ఓటును నిర్ణయిస్తుందని చెప్పడం అతిశయోక్తి. ఓటర్ల వ్యక్తిగత అనుభవం, స్థానిక సమస్యలు, ఆర్థిక పరిస్థితి, కుటుంబం, సామాజిక వాతావరణం, పార్టీలపై నమ్మకం, నాయకుల పనితీరు వంటి అనేక అంశాలు ఓటింగ్‌ను ప్రభావితం చేస్తాయి. మీడియా ప్రధానంగా ప్రభావితం చేయగలిగేది ప్రజలు ఏ అంశం గురించి ఎక్కువగా ఆలోచించాలి? అన్నది. ఒక సమస్యకు నిరంతరం ప్రాధాన్యం ఇస్తే అది ప్రజల దృష్టిలో ప్రధాన సమస్యగా మారవచ్చు. మరో సమస్యకు ప్రాధాన్యం తగ్గిస్తే అది వెనుకబడిపోవచ్చు. ఇది ఓటరుకు నేరుగా ఏ పార్టీకి ఓటు వేయాలో చెప్పకపోయినా.. అతను ఏ అంశాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలో ప్రభావితం చేసే శక్తిగా మారవచ్చు.

### పెయిడ్ న్యూస్ నుంచి ఏఐ వరకు

రాజకీయ ప్రభావం ఇప్పుడు సంప్రదాయ ప్రకటనలకే పరిమితం కాలేదు. పెయిడ్ న్యూస్, స్పాన్సర్డ్ కంటెంట్, రాజకీయ ప్రకటనలు, ఇన్‌ఫ్లుయెన్సర్ క్యాంపెయిన్లు, పాడ్‌కాస్టులు, వైరల్ వీడియోలు.. రూపాలు మారుతున్నాయి. ఈ సమస్య మరింత క్లిష్టమవుతోంది. డీప్‌ఫేక్ వీడియోలు, కృత్రిమ ఆడియోలు, నకిలీ ప్రసంగాలు, మార్చిన ఫొటోలు, పాత వీడియోలను కొత్త సంఘటనలుగా చూపించడం.. ప్రజలను మాత్రమే కాదు, దేశాల సమాచార భద్రతను కూడా ప్రభావితం చేయగలవు. రేపటి సమాచార యుద్ధంలో ఫ్యాక్ట్ చెకింగ్ కేవలం జర్నలిజం సాధనం కాదు.. జాతీయ భద్రతకు సంబంధించిన సామర్థ్యంగా కూడా మారవచ్చు.

### మీడియా ఎవరి వైపు ఉండాలి?

రైట్ వైపు కాదు. లెఫ్ట్ వైపు కాదు. అధికార పార్టీ వైపు కాదు. ప్రతిపక్షం వైపు కూడా కాదు. మీడియా వాస్తవాల వైపు ఉండాలి. ప్రజల ప్రయోజనం వైపు ఉండాలి. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంటే ప్రశంసించాలి. తప్పు చేస్తే ప్రశ్నించాలి. ప్రతిపక్షం మంచి ప్రత్యామ్నాయం చూపిస్తే దానికి స్థానం ఇవ్వాలి. ప్రతిపక్షం తప్పు చేస్తే దానినీ ప్రశ్నించాలి. అధికార పార్టీకి వ్యతిరేకంగా వచ్చిన ప్రతి వార్త నిజం కాదు. అధికార పార్టీకి అనుకూలంగా వచ్చిన ప్రతి వార్త అబద్ధం కూడా కాదు. వార్త నిజానిజాలను నిర్ణయించేది దాని రాజకీయ రంగు కాదు.. దాని ఆధారం. ట్రంప్ ప్రభుత్వం యూరప్‌లో రైట్‌వింగ్ మీడియా కార్యక్రమాలకు ప్రతిపాదించిన నిధులు రాజకీయ ప్రభావం, మీడియా స్వాతంత్ర్యంపై చర్చకు తెరతీశాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్--పాకిస్థాన్ ఘర్షణ చుట్టూ సాగిన సమాచార పోరు యుద్ధభూమికి అవతల కూడా మరో పోరాటం ఉంటుందని చూపించింది. రఫేల్--జీ-10 చర్చలు యుద్ధ నేరేటివ్ రక్షణ మార్కెట్‌ను కూడా ప్రభావితం చేయగలదని గుర్తుచేశాయి. సోషల్ మీడియా, అల్గారిథమ్‌లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు,ఈ పోరాటానికి మరింత వేగాన్ని ఇచ్చాయి. రేపటి రాజకీయ పోరాటం కేవలం పార్లమెంట్‌లో జరగదు. టీవీ స్టూడియోలో జరుగుతుంది. పత్రిక హెడ్‌లైన్‌లో జరుగుతుంది. యూట్యూబ్ వీడియోలో జరుగుతుంది. సోషల్ మీడియా పోస్టులో జరుగుతుంది. వాట్సాప్ గ్రూపులో జరుగుతుంది. రూపొందించిన వీడియోలో కూడా జరగవచ్చు. యుద్ధభూమిలో దేశాలు ఆయుధాలతో పోరాడితే.. సమాచార భూమిలో నేరేటివ్‌లతో పోరాడతాయి. రాజకీయాల్లో ఆ నేరేటివ్‌లు ప్రజల ఆలోచనలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తాయి. అందుకే రేపటి ప్రపంచంలో అసలు పోరాటం కేవలం రైట్ వర్సెస్ లెఫ్ట్ కాదు. అది వాస్తవం వర్సెస్ నేరేటివ్ కూడా కాదు. ఎందుకంటే ప్రతి నేరేటివ్ ఏదో ఒక వాస్తవం నుంచే మొదలవుతుంది. అసలు ప్రశ్న.. ఏ వాస్తవాన్ని ముందుకు తెచ్చారు? ఏ వాస్తవాన్ని పక్కన పెట్టారు? ఎవరిని నమ్మదగిన గొంతుగా చూపించారు? ఏ పదంతో ప్రజల ముందుంచారు? అన్నదే. వార్తకు రంగు ఉండొచ్చు.. వాస్తవానికి రంగు ఉండకూడదు.

**చివరికి మిగిలేది ఒక్క ప్రశ్నే..**
**"నేరేటివ్ ఎవరిది అన్నది కాదు..**
**దాని వెనుక ఉన్న వాస్తవం ఏమిటి?"**

నవజ్యోతి ఎడిటోరియల్ డెస్క్, సెప్టెంబర్ 3
(సాయి మణికంఠ)

---

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి: రాగి రాములు

### ఎస్ఐఆర్‌పై కలెక్టర్‌తో బీజేపీ ప్రతినిధుల సమావేశం

**మెదక్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ఎస్ఐఆర్ మెదక్ జిల్లా కన్వీనర్ రాగి రాములు కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై పలు అంశాలను చర్చించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు వెంటనే సంబంధిత బూత్ స్థాయి అధికారులకు సమాధానాలు అందించేలా రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్లను అప్రమత్తం చేయాలని కలెక్టర్ కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాగి రాములు మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లోని అనుమానాస్పద, నో మ్యాపింగ్ జాబితాల్లో ఉన్న ఓటర్ల వివరాలను బూత్‌ల వారీగా అందించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ప్రతి బూత్‌లో ఎంతమందికి నోటీసులు జారీ చేశారు, వారి పేర్లు, ఇతర వివరాలతో కూడిన పూర్తి జాబితాను రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి రెండు రోజుల్లో బూత్‌ల వారీగా నోటీసులు అందుకున్న వారి పేర్ల జాబితాను అందజేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను అభినందిస్తున్నట్లు రాగి రాములు పేర్కొన్నారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా నోటీసులకు సకాలంలో సమాధానాలు అందించేలా పార్టీ శ్రేణులు చొరవ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మెదక్ అసెంబ్లీ ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్ నల్లాల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



---

## గంజాయిపై తూప్రాన్ పోలీసుల ఉక్కుపాదం

### ఇద్దరు నిందితుల అరెస్ట్.. 100 గ్రాముల గంజాయి స్వాధీనం



**తూప్రాన్, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి నవీన్):**
తూప్రాన్ పట్టణంలోని జాతీయ రహదారి--44పై నర్సాపూర్ బ్రిడ్జి సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని పోలీసులు తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి లభించింది. నిందితులను ఉత్తరప్రదేశ్‌కు చెందిన అలావుద్దీన్ (20), లవకుష్ (20)గా గుర్తించారు. వీరు శభాష్‌పల్లి ప్రాంతంలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఉత్తరప్రదేశ్ నుంచి కంపెనీకి తిరిగి వస్తూ గంజాయిని వెంట తెచ్చుకున్నట్లు దర్యాప్తులో తేలింది. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరిపై మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేశారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరి నుంచి పొందారు, ఎవరికి సరఫరా చేసేందుకు తీసుకువచ్చారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గంగరాజు హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులకు లేదా 112కు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

---

## గోమారంలో ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలకు పోలీసుల కౌన్సెలింగ్



**శివంపేట, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్):**
శివంపేట మండలం గోమారం గ్రామంలో రెండు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు, వర్గాల మధ్య తరచూ జరుగుతున్న ఘర్షణలు, వివాదాల నేపథ్యంలో పోలీసులు ఇరువర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గోమారం గ్రామపంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో తూప్రాన్ సీఐ వెంకట రాజాగౌడ్, శివంపేట ఎస్ఐ మధుకర్‌రెడ్డి పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలు సహజమేనని, వాటిని ఘర్షణలకు దారితీసి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. తరచూ గొడవలకు పాల్పడే వారిపై తహసీల్దార్ ఎదుట బైండోవర్ చర్యలు తీసుకుంటామని, దాడులు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు, అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత రాజకీయ ప్రలోభాలకు లోనై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామంలో సమస్యలు తలెత్తితే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. రానున్న వినాయక చవితి సందర్భంగా కూడా శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇరువర్గాల ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

---



## పవన్ కల్యాణ్ సేవలు స్ఫూర్తిదాయకం: ఎమ్మెల్యే మాధవరం

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 2 (నవజ్యోతి ప్రతినిధి):**
రాష్ట్రానికి, దేశానికి మరింత సేవ చేసేలా పవన్ కల్యాణ్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం కేపీహెచ్‌బీ గోపాల్‌రావునగర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. పవన్ కల్యాణ్ స్ఫూర్తితో యువత రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఆపదలో ఉన్న వారికి ప్రాణదానంగా నిలుస్తాయని పేర్కొన్నారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా అత్యవసర సమయాల్లో వేలాది మందికి రక్తం అందిస్తూ సేవలందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.